
POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మే 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 42 సంచిక: 01




## శ్రీ స్వామి సమర్థ ఆరాధన

మే 06, 2024 (చైత్ర బహుళ త్రయోదశి)

## ఈ నెల పండుగలు

మే 06 - శ్రీ అక్కల్కోట స్వామి ఆరాధన (చైత్ర బహుళ త్రయోదశి)
మే 12 - శ్రీ సాయి లీలామృత గ్రంథ కృతజ్ఞతార్చన
మే 20 - శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారి జయంతి
(కంచి పెద్ద స్వామివారి జయంతి)
మే 23 - బుద్ధ పూర్ణిమ




## 'శ్రీ సాయిలీలామృతము'

మహాగ్రంథ కృతజ్ఞతార్చన

మే 12, 2024

# జ్ఞాని మాటకర్థం జ్ఞానులే తెల్పాలి!

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

భగవంతుడు, గురువు, ఆత్మ వేరు కాదని ఈ మూడు మూర్తులలోను వున్నది ఒకటేనని ఆదిశంకరులు దక్షిణామూర్తి స్తోత్రంలో స్పష్టంగా వ్రాసారు. కానీ ఆ సత్యాన్ని ప్రత్యక్షానుభవంగా తెల్పేవారే గురువని, కనుక గురువు నాశ్రయించడం ఎంతో అవసరమని ఆదిశంకరులే కాక ఆధ్యాత్మిక సాంప్రదాయాలన్నీ చెబుతున్నాయి. భగవాన్ శ్రీ రమణ మహర్షి దానిని ఇలా వివరించారు: "మానవుడు మొదట కష్టాలు తొలగాలని, కోరికలు తీరాలని పరమాత్మను ఆశ్రయిస్తాడు. తర్వాత క్రమంగా భగవంతుని ప్రేమించడం నేర్చుకొని, ఆయనను చేరుకోవాలని ఆరాటపడతాడు. అప్పుడు భగవంతుడే ఒక గురువు రూపంలో అతడికి తారసిల్లి అనుగ్రహిస్తారు. క్రమంగా ఆ గురువు, తన ఆత్మ, భగవంతుడూ ఒక్కటేనని ముముక్షువు తెలుసుకుంటాడు. అదే జ్ఞానం."

ఈ చక్కని సత్యాన్ని సాయి తమ భక్తులకు ఎలా తెలిపారో చూద్దాము.

ఒకసారి ఒక భక్తుడు, ఎన్నో సమస్యలు, కష్టాలు తీరాలన్న ఆశతోనూ, కోరికలు నెరవేరాలన్న దృష్టితోనూ శిరిడీ వస్తున్న సాటివారితో 'శ్రీ సాయి వంటి సత్పురుషుని అలాటి తుచ్ఛమైన లౌకిక తలంపులతో దర్శించరాదని, కేవలం నిష్కామ భక్తిభావంతో దర్శించా' లని బోధించనారంభించాడు. వెంటనే సాయి అతనిని పిలిపించి అతడలా చెప్పటం తగదని, మొదట తమను అందరూ అలానే లౌకికమైన ఆశలతో ఆశ్రయించి క్రమంగా ప్రేమతో నిష్కామంగా సేవించడం నేర్చుకుంటారని చెప్పారు. 'శ్రీసాయి లీలామృతము' లోని భక్తుల అనుభవాలు ఎన్ని చూసినా ఇదే సత్యం గోచరిస్తుంది. చివరికి ఆయనను సేవించిన వారిలో అగ్రగణ్యులుగా లోకఖ్యాతినందిన ఉపాసనీ బాబా మాత్రం సాయిని ఎందుకు మొదట ఆశ్రయించింది? ప్రాణాయామం చేస్తుంటే ఏదో పొరపాటు జరిగి శ్వాస సరిగా ఆడకపోయినప్పుడు ఆ బాధ తొలగాలనికదా ఆయన సాయిని ఆశ్రయించింది? ఇప్పటికి ఒక అంశాన్ని వివరించుకున్నాము. మొదట కోరికలతోనే మానవుడు భగవంతుని



శరణు పొందుతాడని, పొందవచ్చని. వారి భక్తి సరైన స్థాయికి చేరాక, సాయి వంటి సద్గురువు రూపంలో ఆ దైవమే దర్శనమిస్తారని కూడా ఈ భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. ఇక ఈ గురువు మూడవ సత్యాన్ని ఎలా భక్తులకు తెలుపుతాడో చూద్దాము.

శ్రీ సాయిని ప్రత్యక్షంగా దర్శించిన వారిపై ఆయన సాన్నిధ్య ప్రభావమెలా వుండేదో నన్న విషయాన్ని 'శ్రీమతి మేనేజర్' అనే భక్తురాలు ఇలా వర్ణించింది. "ఆయన మన హృదయంలోనేకాక, శరీరంలోని ప్రతి అణువులోనూ నిండియున్నారనిపించేది. ఆయన పలికిన కొద్ది మాటలు, చేసిన ఒక్క కదలిక వలన ఆయనకు మన భూత, భవిష్యత్, వర్తమానాలు సర్వమూ తెలుసునని అర్థమైపోతుంది. సంపూర్ణమైన విశ్వాసంతో ఆయనను శరణు పొందడం తప్ప

**మిగతా 20వ పేజీలో**

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 మే - 2024 సంచిక:01

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | జ్ఞాని మాటకర్థం జ్ఞానులే తెల్పాలి! | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | ఆచార్యులవారి సన్నిధిలో ఒక రోజు | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి భార్గవి | 09 |
| 05. | పూజ్య భరద్వాజ గురుదేవుల ఆరాధనా మహోత్సవం | శ్రీమతి టి.పద్మావతి | 11 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 07. | సన్నిధిలో సాధన! | 'సాయిబాబా' | 16 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 19 |
| 09. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 21 |
| 10. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 23 |
| 11. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి శ్యామలమ్మ | 25 |
| 12. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీరామ్ కుమార్ | 27 |


**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

***పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ***

***ప్రశ్న :- నన్ను నమ్ముకున్న వారిని చివరంటా గమ్యం చేరుస్తానంటారు బాబా. ఆ గమ్యం ఏమిటి? నమ్ముకోనివారంతా గమ్యం చేరనట్లేనా? తనను నమ్ముకోవాలి అని బాబా ఎందుకు కోరుకోవాలి?***

***ఆర్.వి. సత్యన్నారాయణ, నల్గొండ***

**జవాబు** :-"నన్ను నమ్మి నేనిచ్చే మందును తీసుకుంటే నీ రోగం తీరుస్తాను" అని డాక్టరు అంటాడు. జబ్బు తగ్గాలనుకున్నవారు అలా చేస్తేనేగదా జబ్బు తగ్గే అవకాశముండేది? అలాటిదే బాబా అన్నమాట. వైద్యుడు మననుండి కనీసం ఫీజైనా కోరతాడు. సాయి అది కోరరు. ఆయనకు కొబ్బరికాయకొట్టినా తినేది, అగరువత్తి వెల్లించినా మనకు తెలిసినంతలో ఆ సువాసనకు ఆనందించేది మనమే. మన నుంచి చిల్లిగవ్వయైనా ఆశించక మేలుచేసిన వారిపైకల్గే ప్రేమను నమ్మకమంటారు. అది వుంటేనే మన బాగుకోసం ఆయన చెప్పినది మనం చేయగల్గుతాము. అప్పుడు గమ్యం చేరుతాము. ఇక్కడ లక్ష్యమంటే అంతులేని తృప్తి, శాంతి; అదే భగవంతుడు. వైద్యుని నమ్మలేనివారి శరీరానికేది గతో, కేవల ప్రేమ స్వరూపమైన సద్గురుని నమ్మలేని వారి ఆత్మలకూ గతి అదే. "సంశయాత్మ వినశ్యతి" అన్నారు ఋషులు. పై వాక్యాలు చెప్పి సాయి అంటే శిరిడీలో నివసించిన ఆ 5 1/2 అడుగుల శరీరమే కాదని ఆయన తెలిపారు. అన్ని జీవుల రూపాలలోనూ, సకల సృష్టి రూపములోనూ ఏ దైవశక్తివున్నదో అదే తామని భక్తులకు అనుభవమిచ్చారు. అన్నీ ఆయనే అయినప్పుడు మన రూపంలో గూడ ఆయనలోని అంశమే -- భాగమే అయి వున్నది. ఆయనను నమ్మలేకపోవడమంటే మనను మనమే



నమ్మలేకపోయినట్లు. ఇక అటువంటి మనస్సుకు శాంతి ఎక్కడుంటుంది? పై ప్రశ్నలలోని చివరి వాక్యం -- సాయి అంటే ఆ శరీరమేనని పొరపడడం వలన వస్తుంది. అలానే తలచినా, ఎందరి మహనీయుల చరిత్ర చూసినా సాయిచరిత్ర తలమానికంగా సాటిలేనిదిగా నిలుస్తుంది. చరిత్ర చదివితే ఆ ప్రశ్న రాదేమో. ●

(ఫిబ్రవరి 2016 సాయిబాబా మాసపత్రిక నుండి)

# ఆచార్యులవారి సన్నిధిలో ఒక రోజు

(గత సంచిక తరువాయి)

**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ**

అంతేకాక యిప్పటి తల్లిదండ్రులకు తమ పిల్లలు మంచి చదువులు అంటే ఏ యింజనీరో, డాక్టరో చదవాలనే తీవ్రమైన కోరిక వుంటున్నది. దానితో పిల్లలెక్కడ అంతటివారు కారేమోననే భయంతో వారికి ఎప్పుడెప్పుడు రెండు సంవత్సరాలు వస్తాయా, ఎప్పుడు స్కూలులో వేసి చదువుల్లో దింపుదామా అన్న ధ్యాసేగాని పిల్లలవైపునుంచి వారు ఆలోచించడం లేదు. హాయిగా తల్లిదండ్రుల, యింట్లో వాళ్ళ ఒళ్ళలోనూ, చంకల్లోనూ, భుజాలమీద ఎక్కి గారాబాలు పంచుకోవడము, యింట్లోని వారితో, చుట్టుప్రక్కల పిల్లలతో ఆడుకోవడమూ చేయవలసిన వయస్సులో బడులకు వెళ్ళవలసి వస్తున్నది. ఇది వరకు ఆ వయస్సు పిల్లలు ఎప్పుడైనా నిద్రపోవచ్చు, ఎప్పుడైనా లేవవచ్చు. వారు లేచినప్పుడే వారి కార్యక్రమాలు మొదలౌతాయి. అలా వాళ్ళకు హాయిగా నిద్ర తీరేవరకూ నిద్రపోనిచ్చేవారు. నిద్రలోనే వారెంతో ఎదుగుతారు. శరీరం శక్తిని పుంజుకుంటుంది. అందుకని నిద్రలేచిన తర్వాత వారెంతో వుత్సాహంగా అల్లరి, ఆటపాటలతో రోజులు గడిపేవారు.

ఇప్పుడు యిందుకు పూర్తి వ్యతిరేకంగా వారి జీవితాలు మలచబడ్డాయి. వారికి నిద్ర తూగిపోతుంటే బలవంతాన లేపి, పళ్ళుతోమి, స్నానం చేయించి, నోట్లో హడావిడిగా బలవంతాన ఆహారం కుక్కి స్కూళ్ళకు పంపిస్తున్నారు. ఇప్పుడు తల్లిదండ్రులకు మరొక జబ్బుకూడా పట్టుకున్నది. వారికి యిష్టమైనవి కాకుండా వారికి బలవర్ధకమని వీరికి అనిపించినవి పెట్టడం. అందుకని పిల్లలకు తిండిమీద కూడా అయిష్టత పెరుగుతుంది. నాలుగు దెబ్బలు వేస్తారు కాబట్టి బలవంతాన తినడమే జరుగుతున్నది. ఇక స్కూలుకు పంపించిన బాక్సులు ఎలా పంపినవి అలాగే వెనుకకు వస్తున్నాయి కూడా. ఈ పద్ధతివల్ల పిల్లలకు మానసిక అశాంతి రోజురోజుకూ పెరిగిపోతుంది. లోపల పెద్దవాళ్ళమీద కోపం, స్కూళ్ళమీద కక్ష పేరుకుపోయి విద్య అంటే కూడా అయిష్టత ఏర్పడుతుంది."

ఇంతలో ఎవరో వచ్చారు. ఆయన టిఫిన్ తీసుకోవడం ముగించి హాలులోకి వెళ్ళారు. వచ్చినవారు స్థానికులు కారు. ఏదో ఊరినుంచి వచ్చారు. మాస్టరుగారి వుపన్యాసాలు వాళ్ళ ఊళ్ళో ఏర్పాటు చేసుకోడానికి అనుమతికోసం ప్రార్థించడానికి వచ్చారు. వారితో అక్కడి విషయాలను గురించి, అక్కడ మాట్లాడవలసిన విషయం గురించి వివరాలను చాలాసేపు మాట్లాడారు. ఆ ఊర్లో సత్సంగాలు ఎలా చేస్తున్నారు అని అడిగి సత్సంగాలు చేయవలసిన విధానం గురించి వివరంగా చెప్పారు. వారిలో ఒకరు తన వ్యక్తిగత సమస్య గురించి

చెప్పుకున్నారు. అతనికి దానికి పరిష్కారం మాస్టరుగారు చెప్పారు. ఆ తర్వాత వారు మాస్టరుగారి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. ఆయన మళ్ళీ తమ రచనా వ్యాసంగానికి వుపక్రమించారు.

పది నిమిషాలు గడిచిందో లేదో ముగ్గురు ఆడవాళ్ళు వచ్చారు. వాళ్ళు అంతకుముందు అప్పుడప్పుడూ వస్తూపోతూ వుండేవాళ్ళే. కనుక వాళ్ళను చూస్తూనే మాస్టరుగారు, "ఏమ్మా బాగున్నారా? ఏమిటి సంగతులు? అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. వాళ్ళు తమ కుటుంబ విషయాలు, పిల్లల విషయాలు అన్నీ హాయిగా మాస్టరుగారితో మాట్లాడుకున్నారు. విచిత్రమేమంటే అక్కడ కూడా పిల్లల చదువుల ప్రసంగమే వచ్చింది.

వారిలో ఒకామె వీరితోపాటు మొదటిసారిగా వచ్చింది. ఆమె పూజ్యశ్రీ మాస్టరుగారితో యిలా అన్నది: "మా బాబు చదువుపట్ల ఏమాత్రం శ్రద్ధ చూపించట్లేదు మాస్టరుగారూ... ఏమి చేయాలో అర్థం కావటం లేదు. దెబ్బలు వేస్తేనే హోమ్ వర్క్ చేస్తాడు. అంతేకాదు, బాబాపట్ల అస్సలు భక్తేలేదు. దణ్ణం పెట్టమంటే కూడా ఒక్కొక్కరోజు పెట్టడు" అని ఎంతో బాధగా మాస్టరుగారి దగ్గర వాపోయింది. ఆయన చిరునవ్వుతో ఆమెకేసి చూశారు. ఆయన చూపులో తల్లిదండ్రుల అజ్ఞానంపట్ల జాలి, పిల్లలపట్ల వారి ప్రవర్తనమీద కొద్దిగా అసహనం తొంగిచూశాయి. ఆయన ఆమెను, "బాబు వయస్సెంత? అనడిగారు. "ఐదో సంవత్సరం నడుస్తున్నది మాస్టారూ!" అన్నదామె. అలా చెప్పడంలో 'ఆ పిల్లవాడు ఎంతో పెద్దవయస్సువాడుగానూ, తమకు అలవిగానివాడిగానూ' అనే భావం స్ఫురించింది. అదేమాట ఆమె వ్యక్తపరచింది కూడా! "స్కూల్లో వేసి రెండు సంవత్సరాలైంది. అయినా ఈరోజుకూ బలవంతాన బడికి పంపించవలసినదే. వాడు నాచేతులు దాటిపోయాడనిపిస్తున్నది. ఏమి చేయాలో అర్థం కావట్లేదు. దీనికి పరిష్కారం చెప్పండి మాస్టరుగారూ... నాకు చాలా ఆందోళనగా వుంటున్నది" అన్నది.

అందుకు మాస్టరుగారు; "అమ్మా ఈ విషయంలో నువ్వు ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీలేదు. అనవసరమైన ఆందోళనతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోకు. పిల్లవాడికి 5 సం॥లని అంటున్నావు. వాడి వయస్సులో ఎవరికైనా ఆడుకోవాలనే అనిపిస్తుంది. నిజంగా అయితే హాయిగా ఆడుకోనివ్వాలి. వెనుకటి తరం పిల్లలకు 5 సం॥లు వస్తేగాని అక్షరాభ్యాసం చేసేవారు కాదు. నిదానంగా అక్షరాలు నేర్పించడం, నోటితో పద్యాలు, పాటలు, ఎక్కాలు, లెక్కలు చెప్పించడం చేసేవారు. మెల్లగా ఎనిమిది సంవత్సరాలకు కొద్దిగా తెలుగు, కొంచెం లెక్కలూ మాత్రమే వచ్చేవి. అప్పటి తరం వారికి చదువులే రాలేదా? ఒక్కొక్కళ్ళూ ఎంతెంత విజ్ఞానవంతులయ్యారో అన్నివిషయాలలోనూ...వెనుకటితరం గురించి తెలుసుకుంటే అర్థమౌతుంది. అన్ని రంగాలలోనూ ఎంతో ప్రావీణ్యతను సంపాదించిన మహామహులెందరో క్రిందటితరం వరకూ వున్నారు. ఆ రోజుల్లోనే విదేశాలకు వెళ్ళిన వారెందరోవున్నారు. వారంతా యిప్పటి పిల్లల్లాగా చిన్నప్పుడే బలవంతాన దెబ్బలుతిని చదువుకున్నవారు కాదు. బలవంతపరచకుండా అనునయంగా ఆటపాటలతో వాడికి అదే విషయాలు చెప్పటానికి ప్రయత్నించు. వాడు వినకపోతే నాకు చెప్పు. పిల్లలకు వాళ్ళకు యిష్టమైన ఆటలతో మేళవించి చెబితే ఎన్ని విషయాలైనా నేర్చుకుంటారు. బలవంతాన చెబితే మొండితనము, కక్ష, చికాకు, కోపము, చదువుపట్ల విముఖత ఏర్పడతాయి. దానితో వారి వ్యక్తిత్వం చాలా దెబ్బతింటుంది. రావలసిన వికాసం రాదు. అదీగాక ఈ రోజుల్లో స్కూలుకు వెళ్ళే పిల్లలకు ఆడుకునే అవకాశమే వుండడంలేదు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా హోమ్ వర్క్ బోలెడంత వుంటున్నది. అదిచేయకపోతే అటు స్కూలులో టీచర్లచేత, యింట్లో తల్లిదండ్రులచేత దెబ్బలు తినవలసివస్తున్నది. కాబట్టి ఆ పిల్లల మానసిక పరిస్థితి గురించి ఆలోచించు! నువ్వే ఆ స్థానంలో వుంటే ఎలా వుండేదానివి? నిన్ను నీ తల్లిదండ్రులు అలాగే చదివించారా? అనగానే వెంటనే ఆమె అందుకుని, "అవును మాస్టారు! నన్నలా చదివించబట్టే నేను స్కూలుకు వెళ్ళాను. లేకపోతే వెళ్ళేదానిని కాదేమో! వారలా చేయకపోతే నాకు చదువెలా వచ్చేది?" అని ఎదురు ప్రశ్నవేసింది.

అందుకు మాస్టరుగారు అందుకుని, "అదేనమ్మా యిప్పుడు వచ్చిన సమస్య... మనకు చదువు మాత్రమే కావాలి. అంటే డిగ్రీలో వచ్చే చదువు మాత్రమే. విజ్ఞానం మాత్రంకాదు. ఆ డిగ్రీలు ఎంత పెద్దవైతే అంత గొప్ప. ఎందుకంటే అంత ఎక్కువ డబ్బులు వచ్చే వుద్యోగం వస్తుంది గనుక. ఈనాటి మన దౌర్భాగ్యం అదే. చదువంటే విజ్ఞాన సముపార్జన. దాని వలన డబ్బులు రావనికాదు, సంపాదించకూడదనీ కాదు. డబ్బులు, సంపాదన విషయం యిప్పుడు అప్రస్తుతం. పిల్లల చదువుల్లో వారికి విజ్ఞాన బోధన ఎంతవరకూ

జరుగుతున్నది? వాళ్ళకు వైజ్ఞానికపరంగా గనుక చెప్పగలిగితే వాళ్ళు స్కూళ్ళను వదలరు. ఎందుకంటే వారి స్వభావంలోనే 'అన్నీ తెలుసుకోవాలి' అనే జిజ్ఞాస చాలా ఎక్కువగా వుంటుంది. అందుకని వారు ఏదైనా, ఎంతైనా నేర్చుకుంటారు. అందుకనే మాటలు వచ్చిన దగ్గరనుంచి 'ఇది ఎందుకు? ఏమిటి?' అనే ప్రశ్నలు ప్రతిదాని గురించి నిరంతరం వేస్తూనే వుంటారు. చెప్పటానికి మనకు విసుగు పుట్టాల్సిందే! కనుక నువ్వు వాడికి స్కూలులో చెప్పే పాఠాలనే ఆసక్తికరంగా చెప్పడానికి ప్రయత్నించు. బట్టీ కొట్టించడం కాదు" అన్నారు. "అంటే ఎట్లా?" అన్నదామె.

"అంటే ఏమీ లేదమ్మా! వాడి పుస్తకంలో ఒక జంతువు గురించి వుందనుకో.... వుదాహరణకి ఆవు గురించే వున్నది. 'ఆవుకు నాలుగు కాళ్ళు వుంటాయి. రెండు కొమ్ములుంటాయి, ఒక తోక వుంటుంది. అది గడ్డిమేస్తుంది', అని పుస్తకంలో వ్రాసి వుంటుంది. దానిని ప్రశ్నలు-జవాబులు రూపంలో పిల్లలచేత బట్టి కొట్టిస్తారు సాధారణంగా. కానీ పిల్లలకు నిజంగా ఆవును చూపిస్తే చాలా బాగుంటుంది. వీలు పడినప్పుడు దాని పాలు ఎంత బాగుంటాయి, త్రాగితే ఎంత మంచిది... అవు దూడ ఎంత ముద్దొస్తుంది, ఎలా గంతులు వేస్తుంది... వాళ్ళమ్మ దానిని ఎంత గారాబం చేస్తుంది, తల్లితో కలిసి మేతకెలా వెళ్తుంది.... అది మేత ఎలా తింటుంది, కుడితెలా తాగుతుంది. నెమరెలావేస్తుంది, ఎలా నిద్రపోతుంది... యివన్నీ చెబితే వారెంతో ఆసక్తిగా వింటారు. అవకాశమున్నప్పుడు వారిని తీసుకునివెళ్ళి ఒకసారి చూపిస్తే ఎంతో బాగుంటుంది. అప్పుడు వారికాపాఠం కొట్టినపిండే. అలాగే అదే సమయంలో యితర జంతువుల గురించి చెప్పవచ్చు.

అలాగే మొక్కల గురించి కూడా! చిన్న చిన్న మొక్కలను, చెట్లనూ చూపిస్తూ వాటి గురించి చెప్తే ఎంతో ఆసక్తిగా వింటారు. అప్పుడు వారికి పాఠం వింటున్నట్టనిపించదు. కొత్త విషయం తెలుసుకుంటున్నట్లు వుంటుంది" అన్నారు.

అప్పుడామె, "మాకివి యిట్లా తెలియదు. మాస్టారు.. మీరు చెబుతూంటే మాకెంతో బాగుంది... అలాగే చేయడానికి ప్రయత్నిస్తాను"

అప్పుడు మాస్టరుగారిలా అన్నారు. "భక్తి గురించి గూడా ఆందోళన పడాల్సిన అవసరంలేదు. వీలున్నప్పుడల్లా బాబా లీలలు కథలలాగా వారికి చెబుతూండు. బాబాపట్ల వాడికే భక్తి కలుగుతుంది" అన్నారు. ఆ తర్వాత ఆ ఆడవాళ్ళు కొద్దిసేపు మిగిలిన విషయాలు మాట్లాడి చాలా తృప్తిగా సెలవు తీసుకున్నారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు పిల్లలకు చదువు చెప్పే విధానం ప్రత్యేకంగా వుండేది. ఆయన తరగతిలో పుస్తకాలు మాత్రమేగాక జనరల్ బుక్స్ ఎక్కువగా చదివించేవారు. అందుకోసం ఆయన ఎన్నో పుస్తకాలు కొని తెచ్చేవారు. తెప్పించేవారు. తమకు, వారికి విరామంవున్న సమయంలో ఆ పుస్తకాలను చదివించేవారు. ఆయన పిల్లలచేత ఎక్కువగా వ్రాయించడం నేను ఎన్నడూ చూడలేదు. ఆ పుస్తకాలను చదివిస్తూ దానిలోని విషయాలకంటే యింకా ఎక్కువ విషయాలు చెప్పి వారి విజ్ఞానాన్ని పెంపొందించేవారు. పిల్లలుకూడా ఎంతో ఆసక్తిగా వినేవారు.

ఆయన పిల్లలను ఏ విషయంలోనైనా బలవంతపరచేవారు కాదు. వారు నిద్రలేవగానే కొన్ని శ్లోకాలు వారిచేత చెప్పించేవారు. ఆరతికి కూడా వారు నిద్రలేస్తేనే వచ్చి కూర్చోమనేవారు. వారికి నిద్ర మెలకువ రాకపోతే బలవంతాన లేపి ఆరతికి కూర్చోమని ఎన్నడూ చెప్పలేదు. అలాగే అన్ని విషయాలలోనూ వారికి నచ్చచెప్పేవారే కాని బలవంతపరచేవారుకాదు.

ఆ ఆడవాళ్ళతో పూజ్యశ్రీ మాస్టరుగారు మాట్లాడుతూవుండగానే మరికొందరు స్థానికులు వచ్చి కూర్చున్నారు. వాళ్ళల్లో మాస్టరుగారిని దర్శించుకోవాలన్న వుద్దేశ్యంతో వచ్చినవారు కొందరైతే, మరికొందరు వారి వ్యక్తిగత సమస్యలు చెప్పుకోవాలని వచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు వారితో కొంతసేపు మాట్లాడారు. వచ్చినవారిలో ఒకరు యిలా అన్నారు: "పిల్లల చదువుల విషయం మీరు చెప్పింది చాలా బాగుంది. మాకిలా చెయ్యాలని తెలియదు. మాకు వారు బాగా చదివి మంచి వుద్యోగాలు సంపాదించాలని వుంటుందేగాని యిలా ఆలోచించాలని తెలియదు. యిప్పుడు మీరు చెప్పిన మాటలు విన్నప్పటినుంచి మాకు పిల్లలవైపు నుంచి ఆలోచించాలనిపిస్తున్నది." అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు, "అవును, అదే సరైన పద్ధతి" అన్నారు. తర్వాత వ్యక్తిగత సమస్యలు చెప్పుకున్న వారికి పూజ్యశ్రీ మాస్టరుగారు తగిన విధంగా పరిష్కారాలు సూచించి బాబా మేలు చేస్తారని ఆశీర్వదించారు.

**- సశేషం**

# మాతృదేవి స్మృతులు

***శ్రీమతి భార్గవి, ఒంగోలు***

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలలను, వారితో తనకు గల అనుభవాలను ఒంగోలు వాస్తవ్యురాలు శ్రీమతి భార్గవిగారు ఈ విధంగా తెలియచేస్తున్నారు.

నేను మొట్టమొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని 2009 జనవరి 23వ తేదీన హైదరాబాదులోని నాగోలులో దర్శనం చేసుకున్నాను. అంతకుముందు నేను బాబా గుడిలో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరానికి వెళ్లడం, పారాయణ చేసుకోవడమే కానీ, వారి ఇంటికి ఎప్పుడూ వెళ్ళలేదు. ఒకసారి కృష్ణవేణమ్మగారు పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లో పూలంగిసేవ జరుగుతోంది రమ్మని చెప్పారు. అప్పటినుంచి అప్పుడప్పుడూ పూజ్యశ్రీ మాస్టరుగారి నిలయానికి వెళ్లేదాన్ని.

ఒకసారి ఒంగోలు సత్సంగసభ్యులకు హైదరాబాదులో వున్న పూజ్యశ్రీ అమ్మగారికి భిక్ష సమర్పించుకునే మహదవకాశం కలిగింది. అప్పుడు వీలున్నవాళ్ళు హైదరాబాదు వెళితే, నేనూ, మా అమ్మ కూడా వాళ్లతో వెళ్ళాము. సరోజనమ్మగారి ఇంట్లో దిగి, భిక్ష తయారుచేసుకుని మధ్యాహ్నం సమర్పించాము. సాయంత్రం సత్సంగానికి వెళ్ళినప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు సత్సంగ హాలులోకి రాగానే నాకు కన్నీళ్లు ఆగలేదు. 'నేనసలు జీవితంలో పూజ్యశ్రీ అమ్మగారిని చూడగలనా? అసలు హైదరాబాదుకు వెళ్లగలనా?' అనుకున్నాను. అందువల్ల అంత భావోద్రేకం కలిగింది. అప్పుడే మా అమ్మ, "మా భార్గవి పెళ్లి మీరే చేయాలమ్మగారూ!" అని అడిగింది. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు నాకు కొన్ని పారాయణలు, కొన్ని ఆచరించవలసిన నియమాలు చెప్పారు. అక్కడనుంచి వచ్చాక నేను అన్నీ శ్రద్ధగా చేస్తూవున్నాను.

చిత్రంగా వెంటనే ఫిబ్రవరి నెలలోనే పూజ్యశ్రీ అమ్మగారు ఒంగోలుకి వచ్చారు. దాదాపు మూడు నెలలు వున్నారు. నాకు ప్రతిరోజూ పండగే! ఎందుకంటే, నాకు ఆధ్యాత్మికమార్గంలో చాలా సందేహాలుండేవి. ఎవరిని అడగాలో తెలిసేది కాదు. పూజ్యశ్రీ అమ్మగారు ప్రతిరోజూ సాయంత్రం దర్శనం ప్రసాదించేవారు. అప్పుడు నా సందేహాలన్నీ అడిగేదాన్ని. పూజ్యశ్రీ అమ్మగారు ఓపికగా చెప్పేవారు. చాలా విలువైన విషయాలు చెప్పేవారు.

ఒకరోజు నేను పూజ్యశ్రీ అమ్మగారితో, "అమ్మా! నేను సాయి సన్నిధి పారాయణ చేస్తుంటే, మధ్యాహ్న సమయంలో ఒక ముసలాయన మా ఇంటికి వచ్చి, అన్నం పెట్టమని అడిగాడు. సరేనని అన్నం పెట్టి, మా ఇంట్లో గ్లాస్ తో మంచి నీళ్లు ఇచ్చాను. మా అమ్మ, 'అలా గ్లాసులో నీళ్ళెందుకిచ్చావు? దోసిలికి పట్టమని పొయ్యవలసింది!' అన్నది" అని చెప్పగానే, పూజ్యశ్రీ అమ్మగారు మా అమ్మ వైపు చూశారు. అప్పుడు మా అమ్మ, "ఇదివరకు మన ఇంట్లో పనిచేసే జీతగాళ్ళకి దోసిట్లోనే తాగడానికి నీళ్లు పోసేవాళ్ళు కదమ్మా, అందుకే అలా చెప్పాను" అంది. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "మనం ఇదివరకటి వాళ్ళలాగా మడీ, ఆచారం అన్నీ పాటిస్తుంటే ఆలా చేయవచ్చు. మనం అవి ఏమీ పాటించకుండా, అదొక్కటే పాటిస్తే ఎలా? ఆ గ్లాస్ శుభ్రంగా తోముకుని వాడుకోవచ్చు, లేదా ప్లాస్టిక్ గ్లాస్ లో ఇవ్వవచ్చు, అంతేకానీ, అన్నం పెట్టి మంచినీళ్లు ఇవ్వకపోతే ఎలా?" అన్నారు! నాకైతే ఇది ఎంతో మంచి బోధ అనిపించింది.

ఇంకొకరోజు నేను సత్సంగంలో, "అమ్మా! అనుగ్రహం అంటుంటారు కదా! అంటే ఏంటమ్మా?" అనడిగితే, రెండు నిముషాలు మౌనంగా వుండి, "ఇక్కడ ఇలా కూర్చోవడం అనుగ్రహం, పారాయణ చేసుకోవడం అనుగ్రహం, ఆయనను స్మరించటం అనుగ్రహం, ధర్మంగా వుండాలని తెలియటం అనుగ్రహం, తెలుసుకున్నాక

మారాలనుకోవడం అనుగ్రహం, తెలుసుకున్నదానిని ఆచరణలో పెట్టాలనుకోవడం అనుగ్రహం, మానవజన్మ ఒక అనుగ్రహమే! జీవితంలో కష్టాలున్నాయి అనుకుంటాము కానీ, అవన్నీ నిజంగా కష్టాలు కావు! అవి బాబాను తలచుకోవడానికి ఉపయోగపడే పరిస్థితులు! ఇలా చూస్తే అంతటా అనుగ్రహమే! జీవితంలో ప్రతిదీ అనుగ్రహమే! ఇవన్నీ అనుగ్రహంలోని వివిధ స్థాయిలు.. ఇలా అనుగ్రహం కుప్పలు తెప్పలుగా వుంటుంది!" అని చెప్పారు పూజ్యశ్రీ అమ్మగారు.

"మరి ఇంత చేసిన బాబాకి, పూజ్యశ్రీ మాస్టరుగారికీ మేము ఏం చేయగలుగుతాము?" అని నేను అడిగాను. "దానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి 'స్మరణ', రెండవది 'సేవ', లేదా 'ఏదైనా సహాయం చెయ్యడం!'" అని చెప్పారు పూజ్యశ్రీ అమ్మగారు. "సహాయము లేదా సేవ అంటే ఎలా చెయ్యాలమ్మా?" అని అడిగాను. "సేవ చేయాలనుకుంటే చాలా మార్గాలున్నాయి. మన దగ్గరలో వున్న అనాథాశ్రమాలు, వికలాంగులు, బాలలు, వృద్ధులు వారికేదైనా సహాయం చేస్తే అది సేవే! మళ్ళీ దాన్ని పేరు ప్రతిష్టల కోసం చేయకూడదు. వారి రూపంలో వున్న బాబాకి సేవ చేస్తున్నామనుకోవాలి" అని చెప్పారు. ఇలా నాకొచ్చే ప్రతి సందేహమూ పూజ్యశ్రీ అమ్మగారిని అడిగేదాన్ని.

కొంతకాలానికి పూజ్యశ్రీ అమ్మగారు హైదరాబాదుకు వెళ్లిపోయారు.

తరవాత నాకు నాగోలులో వుండే అవకాశం వచ్చింది. అప్పుడు సరోజనమ్మగారి ఇంట్లో వుండేదాన్ని. కొద్దిరోజుల తరువాత మా అన్నయ్యకి ఒంట్లో బాగోలేదని ఫోన్ వస్తే వెళ్ళిపోయాను. ఇంక మళ్ళీ తిరిగి వెళ్ళలేకపోయాను.

పూజ్యశ్రీ అమ్మగారు నా వివాహవిషయంలో నాకు కొన్ని సాధనలు చెప్పారు. అవి చెప్పి ఆరు సంవత్సరములు దాటిపోయింది. నేను అలాగే చేస్తూవున్నాను. 2016 లో దసరాలకి ముందు పూజ్యశ్రీ అమ్మగారు స్వప్నదర్శనమిచ్చారు. ఆ స్వప్నంలో, "మూడు తమలపాకులు, వక్కపొడి, రెండు ఖర్జూరాలు, పసుపు, కుంకుమ పెట్టి, తాంబూలం 11 రోజులు 11 మందికి ఇవ్వు!" అని చెప్పారు. నేను నవరాత్రులలో మొదలుపెట్టి పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరం దగ్గరకు వచ్చేవారికి పంచేదాన్ని. నవరాత్రులు పూర్తైన కొన్నిరోజులకు మా అన్నయ్య స్నేహితుడి ద్వారా ఒక సంబంధం వచ్చింది. ఫోటో, మిగిలిన వివరాలూ పట్టుకుని, నాగోలుకు వెళ్లి పూజ్యశ్రీ అమ్మగారికి పంపించాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు అనారోగ్యం కారణంగా దర్శనమివ్వడం లేదు. "తనకు నచ్చితే చేసుకోవచ్చు!" అని పూజ్యశ్రీ అమ్మగారు కబురు పంపారు. డిసెంబర్ 14, 2016 లో నాకు వివాహమైంది.

పూజ్యశ్రీ అమ్మగారు జూన్ 3 వ తేదీన సమాధి చెందినప్పుడు ఇంట్లో పరిస్థితులవల్ల నాకు వెళ్ళడానికి కుదరలేదు. చాలా బాధపడ్డాను. మేము కావలిలో వుంటాము. ప్రత్యక్ష ప్రసారం వుండటం వల్ల చివరిసారిగా పూజ్యశ్రీ అమ్మగారిని చూసుకోగలిగాను. కానీ చిత్రంగా మండలారాధన రోజున కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో చూస్తూ, నేను ఇంట్లో పూజ్యశ్రీ అమ్మగారికి ఏదైనా నైవేద్యం చేద్దామని ప్రయత్నిస్తుంటే, మావారు, "అక్కడకి వెళ్లాలని వుందా?" అని అడిగారు! ఔనని చెప్పాను. సరే బయలుదేరమని ఆయన కూడా దర్శనానికి వచ్చారు. పూజ్యశ్రీ అమ్మగారి కృపకు ఆశ్చర్యపోయి అనేక కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

నేను ప్రతివిషయం పూజ్యశ్రీ అమ్మగారితో మనసులోనే చెప్పుకుంటాను. వెంటనే దానికి సమాధానం వస్తూవుంటుంది. ఈమధ్య పూజ్యశ్రీ అమ్మగారు స్వప్నంలో నా చెవి దగ్గరగా వచ్చి," ఏమిటీ? నీకు అలా జరిగిందా! నిన్ను అలా అంటారా?" అని అడుగుతున్నారు. అంటే నేను చెప్పుకున్నవన్నీ పూజ్యశ్రీ అమ్మగారికి చేరాయని తెలియచేసినట్లనిపించింది. తరవాత నా పరిస్థితిలో కొంచెం మంచి మార్పు వచ్చింది.

ఇప్పుడు నాకు ఇద్దరు పాపలు. పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల బాగున్నారు. నాకు ఎప్పుడైతే పూజ్యశ్రీ అమ్మగారు పరిచయం అయ్యారో అప్పటినుంచి నేను వారి నుండి ఎంతో ప్రేమని పొందాను. అది ఏ బంధానికీ తులతూగదు. ఆ ప్రేమే లేకపోతే నేను ఏమైపోయేదాన్నో అనిపిస్తుంది. ఈజన్మలో నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి, పూజ్యశ్రీ అమ్మగారితో కలిగిన అనుబంధం ఒక గొప్ప వరం. ప్రతి జన్మలోనూ ఇదేవిధంగా నాకు తోడుగా వుండాలని వారి పాదపద్మములకు ప్రణమిల్లుతూ అంజలి ఘటిస్తున్నాను.

*ఓం సన్మార్గప్రదాయై నమః!*
*జై సాయి మాస్టర్!!*

# పూజ్య భరద్వాజ గురుదేవుల ఆరాధనా మహోత్సవం

***శ్రీమతి టి.పద్మావతి***

ఒంగోలు సమీపంలోని గుమ్మళంపాడు గ్రామములో, పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి దివ్యసన్నిధానములో భరద్వాజ గురుదేవుల ఆరాధన మహోత్సవం 12-4-2024వ తేదీన భక్తులందరూ వైభవంగా జరుపుకున్నారు.

పలు ప్రాంతాల నుంచి ఈ వేడుకల్లో పాల్గొనడానికి భక్తులు వేంచేశారు. వారందరూ ముందు రోజు సాయంత్రం నుంచి మావిడాకుల తోరణాలు కట్టి, ముంగిట చక్కని రంగవల్లులు తీర్చిదిద్దారు. మరొకవైపు చాణక్య బృందం వారు, ముందు రోజు రాత్రి అంతా సన్నిధానమును, అందులో నెలకొని వున్న మూర్తులను, రకరకాల కుసుమాలతో సుమమాలలతో అలంకరించారు. పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవులు, ఒకవైపు పూజ్యశ్రీ బాబా గారు మరొకవైపు పూజ్యశ్రీ అమ్మగారు కొలువై వుండగా మధ్యలో మూర్తీభవించిన చిత్రపటం రూపంలో ఆసీనులై వున్నారు. మనోహరమైన వారి రూపం ఆ సన్నిధానములో ప్రవేశించినంతనే అందరి హృదయాలను ఆకట్టుకున్నది.

ఏప్రిల్ 12 వ తేదీ ఉదయం ఐదున్నర గంటలకు గురుదంపతుల మేలుకొలుపు సేవతో వేడుకలు మొదలయ్యాయి. ఆరు గంటలకు శ్రీ బాబా వారికి కాకడ హారతి యథావిధిగా జరిగింది. ప్రత్యేక అభిషేకము అనంతరం ఎండు ఫలముల(డ్రై ఫ్రూట్స్) తో అలివేలు మంగమ్మ తల్లి సమాధిని అత్యంత రమణీయంగా అలంకరించటమే కాక పూజ్యశ్రీ గురుదేవుల మూర్తిని అద్భుతంగా తీర్చిదిద్దారు. అలంకరణ పూర్తయిన పిదప ముగ్గురు మూర్తులకు ప్రత్యేక ఉపాహార విందుని సమర్పించారు. తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రియ పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు వారి శ్రీమతి లయ రాగిత గారితో విచ్చేసారు. వారిద్దరూ గురుదంపతులకు ప్రణామములాచరించిన అనంతరం, శ్రీ ద్వారకబాబుగారు సత్సంగాన్ని ప్రారంభించారు.

***శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారి సత్సంగం:***

గురు పుత్రులు శ్రీ ద్వారక బాబు గారు ముందుగా ... పూజ్య గురుదేవుల ఆరాధన మహోత్సవ సందర్భంగా వారు సదా మనలందరిని కాపాడుతూ ఆధ్యాత్మిక పురోగతి ప్రసాదించి, వారిలో శాశ్వత ఐక్యత పొందేటట్లు అనుగ్రహించమని ప్రార్థనచేసి .. . సత్సంగాన్ని కొనసాగించారు.

మన అందరిలో మన భావాలను అనుసరించి పూజ్య గురుదేవులకు ప్రత్యేకత వుంటుంది. కొంతమందిలో పూజ్యశ్రీ మాస్టరుగారి గొప్పతనం, వారి బోధలు, వారి ప్రేమతత్వం ప్రాధాన్యత వహిస్తాయి. మరి కొంతమంది, వారి సాధన, వారి జీవితం బాగుండాలని ఆశిస్తూ ప్రార్థిస్తారు. ఇంకొంతమంది ఇలాంటి ప్రత్యేకమైన రోజున వారిని ప్రార్థిస్తే కష్టాలు కోరికలు తీరుతాయని భావిస్తారు. ఇలా రకరకాలైన వారి అభిప్రాయాలను అనుసరించి ఈ పండగ చేసుకుంటారు.

ఇదే ఆరాధనా మహోత్సవం 2124 లో అంటే, ఇంకొక 100 సంవత్సరాలు తర్వాత కూడా ఇదే విధంగా అందరం చేసుకుంటాం. అయితే మనం ఈ మహోత్సవాన్ని

వంద సంవత్సరాల తర్వాత చేసుకునేటప్పుడు ఇప్పటికంటే మరింత భక్తిశ్రద్ధలతో, మరింత ఆధ్యాత్మిక భావాలతో చేసుకోగలగాలంటే మనందరిలో సాధనాపరంగా మార్పు రావాలి. ఇక్కడ ఎంతమంది ఋషులు మహాత్ములు ఈ మహోత్సవానికి పూజ్య గురుదంపతులను దర్శించుకోవడానికి వస్తున్నారో కదా, అనుకుంటూ అత్యంతభక్తిశ్రద్ధలతోపుణ్యక్షేత్రానికివచ్చినట్లుపరిశుద్ధమైన భావంతో ఇక్కడికి రావాలి. ఇలా పరిణితి చెందడమే అసలైన ఆరాధన మహోత్సవం. మనలో శ్రద్ధ పెరిగే కొద్దీ మామూలుగా ప్రధానం అనుకున్నవి అప్రధానమవుతాయి. ఆధ్యాత్మికంగా మనసు నిలిపి ఆనందం పొందేవే ప్రధానమవుతాయి. ఇవన్నీ జరిగిన నాడు, ఇక్కడ కొన్నివేల మంది ఆధ్యాత్మికత గురించి మాట్లాడుకుంటూ ఆనందించే వాళ్ళు వుంటారు. మనం కూడా వారందరిలో ఒకరుగా వుండాలంటే, పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాలు చదివి, తత్వచింతన పెంచుకోవాలి. అప్పుడే రాబోయే 100 సంవత్సరాల అద్భుతమైన భవిష్యత్తులో మనం కూడా ఒక భాగం అవుతాము. ఇప్పటినుంచి ఎంత భావంతో ప్రయత్నిస్తున్నామన్న దాన్నిబట్టి అంత త్వరగా ఆ భవిష్యత్తు సాకారం అవుతుంది.

ఆధ్యాత్మిక మార్గానికి పూజ్యశ్రీ మాస్టరుగారు వేసిన రహదారి ఏదైతే వుందో అది సాకార రూపం దాల్చడానికి ఏర్పడిన స్తంభాలు, మనం ప్రతి సంవత్సరం జరుపుకునే పూజ్యశ్రీ బాబాగారి, అమ్మగారి, మాస్టరుగారి, ఆరాధనలు, జయంతులు, కృతజ్ఞతా మహోత్సవాలు, ఇంకా కొన్ని ఇక్కడ జరిగే ముఖ్యమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు. ఇవన్నీ అత్యంత శ్రద్ధగా చేసుకోగలిగితే అవే మన భవిష్యత్తుకు పునాదులు. అప్పుడే వారు చేస్తున్న యజ్ఞంలో మనమూ భాగస్థులమవుతాం. వీటన్నింటినీ ఆచరించుకోవడానికి అరుదైన అవకాశం మనందరికీ యివ్వబడింది. అంటే సరైన వ్యవస్థీకరణతో మహాత్ములు చెప్పిన విధంగా మనం భగవదార్చన చేసుకునే సంస్కృతిని ఏర్పరచుకోవడానికి మనకు కల్పించబడిన అతి అరుదైన అవకాశం.

ఈ విషయాన్ని బాగా గుర్తుంచుకొని ఇంత పవిత్రమైన సన్నిధిలో ఈ అవకాశాలని సద్వినియోగపరుచుకునే బుద్ధిని ప్రసాదించి, మానవజాతిని సన్మార్గం వైపు నడిపించమని గురదంపతులకు ప్రార్థన చేస్తున్నాను - అంటూ ఆ పూట సత్సంగాన్ని ముగించారు. అనంతరం మధ్యాహ్న భోజన నివేదన, ప్రసాద వితరణ జరిగింది.

సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలులోని భక్తులు 'శ్రీ గురు భరద్వాజ బృందావనం'లో సేవలు, అలంకరణలు, పూజ మొదలైన కార్యక్రమాలు భక్తి తో చేసుకుని పూజ్య అమ్మగారి దివ్య సన్నిధానమునకు చేరుకున్నారు. అందరి సమక్షంలో శ్రీ ద్వారక బాబుగారు విశేష పూజ గావించారు. తదనంతరం సత్సంగం చేశారు.

***శ్రీ గురుపుత్రుల సాయంకాల సత్సంగము:***

పూజ్యశ్రీ మాస్టరుగారి ఆరాధన మహోత్సవ సందర్భంగా వారి గురించి కానీ, ఆధ్యాత్మికత గురించి, జీవితం గురించి ఏం మాట్లాడాలన్నా, వారు రాసిన గ్రంథాలను జాగ్రత్తగా చదువుకోవాలి. ఎవరు ఏం చెప్పినా వాటి నుంచే చెప్పాల్సి వుంటుంది. మనకి ఏ సమస్య వున్నా, తిరిగి తిరిగి వారి గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడమే సరైన మార్గం అని ముగింపుకి వస్తాం. ఎందుకంటే మనందరికీ,,, భగవంతుడు అంటే ఏమిటి? జీవితం అంటే ఏమిటి? పాపపుణ్యాలు అంటే ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సరైన సమాధానం కానీ, దానికి సరిపడినంత అవగాహన కానీ వుండదు. ఏదో తెలిసీ తెలియక అక్కడక్కడ విన్నవాటిని, చూసిన వాటిని బట్టి జీవితాన్ని నడిపిస్తూ వుంటాం.

ఒక్కొక్కసారి జీవితం భయపెడుతున్నప్పుడు, కాలక్షేపాల్లోనో లేకపోతే మనకు అందుబాటులో వున్న చిన్న చిన్న సరదాలతోనూ గడిపేస్తుంటాం. లేదా అధర్మ మార్గం వైపు అడుగుపెడుతూ వుంటాం. దానివల్ల వచ్చిన పరిస్థితులు కొన్నాళ్ళకి మనకి అడ్డం పడుతూ వుంటాయి. సమాజంలో చాలామంది తను ఎంతవరకు నీతి గా వున్నాడో, అంతవరకూ సమర్థించుకుంటూ పోతాడు. అలా వుండలేని పరిస్థితుల్ని పట్టించుకోకుండా వదిలేస్తాడు. వీటివల్ల జరిగే పర్యవసానాలు అర్థం కాక అయోమయంలో పడుతుంటాడు. అయితే ఎక్కడో చాలా తక్కువమందిలో సున్నిత మనస్కులు వుంటారు. వారు ఈ జరిగే పరిణామాల్ని ఆలోచిస్తూ, వీటినించి ఎలా బయటపడాలా అని తీవ్రంగా శోధన చేస్తూ వుంటారు. అట్లా ఆలోచించిన

***మిగతా 24వ పేజీలో***

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 13వ ప్రసంగము

ఆ రోజులలో శ్రీ స్వామి ప్రకాశానందులవారు గోండలులో వున్నారు. వారు పీఠడియా వెళ్లవలసివున్నది. ఇది తెలుసుకొని అక్కడి వైద్యులు రాఘవజీ భాయి వారిని అడిగారు – "మీరు ఎక్కడికి వెళుతున్నారు?"

స్వా॥ని॥ :- నేను పీఠడియా వెళ్లాలనుకుంటున్నాను. అక్కడ శ్రీ నిత్యానంద స్వామివారనే మహాపురుషులు వున్నారు.

రాఘవ :- నేను కూడా తమతో వారి దర్శనానికి రావచ్చా?

స్వా॥ని॥ :- ఏమీ అభ్యంతరము లేదు.

అప్పుడు వారిద్దరూ పీఠడియా వెళ్లి నిత్యానందులవారిని దర్శించారు. స్వామివారు ఎంతో సంతోషించి, వారు స్వయంగా చెంబుతో నీళ్లు నింపి తీసుకువచ్చి కాళ్లు కడుక్కోవడానికి సమర్పించారు.

స్వా॥ప్ర॥:- స్వామీ తమకు ఇంతమంది సేవకులు వుండగా తమరు స్వయంగా ఎందుకు శ్రమ పడుతున్నారు?

### స్వామివారి సేవాభావము

స్వా॥ని॥ :- రుక్మిణి శ్రీకృష్ణ భగవానునికి పరిచర్యలు చేయడానికి ఎల్లప్పుడూ నిలబడి వుండేది. ఇది చూసి ఒకరు ఇలా ప్రశ్నించారు– "అమ్మా! తమ ఆజ్ఞలను నెరవేర్చడానికి యింతమంది దాసదాసీ జనులు వుండగా తామే ఎలా ఇలా నిలబడి ఉన్నారు?" ఆమె ఇలా సమాధానం ఇచ్చింది– "నాకు శ్రీకృష్ణునికి వివాహమైంది. దాసీజనులకు కాదు కదా! కాబట్టి ఆయనను సేవించడానికి నిలబడి వుండటం నా ధర్మము. నాకున్న ప్రేమ దాసీలకు వుండదు".

అదే విధంగా నాకు మీ పట్ల వున్న ప్రేమ దర్బారు నౌకరులకు వుండదు. మీకు స్నేహితులు చాలామంది

గొప్పవారు వున్నారు. మీరు వారిని వదిలి దూరం నుండి యిక్కడికి చాలాసార్లు వస్తున్నారు. కానీ నేను మాత్రం ఒక్కసారి కూడా రాలేకపోతున్నాను. నేను జైల్లో వున్న పాత నేరస్తుడి వంటివాడిని.

ఇలా అంటుండగానే వారి హృదయంలో ప్రేమ పొంగిపోయింది. వారి కంఠం గద్గదమైంది.

## అన్యోన్యాకర్షణము

స్వా॥ప్ర॥ :- నేను ఎప్పుడు బయలుదేరాలన్నా ఏవో ఇబ్బందులు కలుగుతూనే వున్నాయి. వాటిని తప్పించుకొని నేనిక్కడికి రావడంలో తమలో సహజంగా వున్న ఆకర్షణే కారణం. అందుచేతనే ఇక్కడికి రావడానికి ఏదో విధంగా ప్రయత్నిస్తూనే వుంటాను.

స్వా॥ని॥ :- ఇది అన్యోన్యాశ్రయమే. నేను కూడా తమరిని తరచుగా తలుచుకుంటూ మీ రాకకు ఎదురు చూస్తూనే వుంటాను.

## రోమరోమాల నుండి నిత్యము వెలువడే అపూర్వమైన ప్రేమనాదము

కృష్ణ భగవానునికి ఎల్లప్పుడూ అర్జునుని దగ్గరకు వెళ్లాలని అనిపిస్తూవుండేది. ఇది రుక్మిణికి ఎంతో బాధ కలిగించేది. ఆమె చాలాసార్లు యిలా అన్నది: "తమను సేవించడానికి నేను సిద్ధంగా వున్నాను. అయినా మీరు అర్జునుని దగ్గరకే ఎప్పుడూ పరిగెత్తుతున్నారు. అర్జునునిలో గొప్ప ఏమిటి?" ఇలా అనేకసార్లు రుక్మిణి బాధపడింది. ఒక రోజున మామూలుగానే అర్జునుని దగ్గరకు వెళ్లడానికి శ్రీకృష్ణుడు ప్రయత్నిస్తూవున్నాడు. ఆ రోజున యాదవులకు శ్రీకృష్ణుని అవసరం ఎక్కువగా వున్నది. కృష్ణుని తమతో వుండమని వారు ఆయనను ఎంతో పట్టుబట్టారు. రాణుల అంతపురంలో కూడా ఏదో ఉత్సవం జరుగుతూ వున్నది. కాబట్టి రుక్మిణి మొదలైన పట్టమహిషులు (పట్టపురాణులు) ఆయనను ఆపుటకు ఎంతగానో ప్రయత్నించారు అయినా ఎప్పటిలాగే కృష్ణుడు అర్జునుడి వద్ద దగ్గరకు వెళ్ళిపోయాడు. ఆయన వెళ్లేటప్పటికీ అర్జునుడు వేటకు వెళ్లి అలసిపోయి తిరిగి వచ్చాడు. అప్పుడు స్నానం చేసి మంచం మీద పడుకొనివున్నాడు. ద్రౌపది తడిసిన అతని వెంట్రుకలను సవరిస్తూవున్నది. ద్రౌపది కృష్ణునికి ఆసనము తీసుకొని రావడానికి లోపలికి వెళ్ళింది. ఇంతలో కృష్ణుడు అక్కడే కూర్చుని అర్జునుని వెంట్రుకలను విడదీయ సాగాడు.

ఎంతో పట్టుదల పట్టినా ఆగకుండా కృష్ణుడు వెళ్లిపోవడం వలన రుక్మిణి క్రోధంతో శ్రీకృష్ణుడు అక్కడికి వెళ్లి ఏమి చేస్తున్నాడో చూడడానికి వచ్చింది. కృష్ణుడు అర్జునుని తల వెంట్రుకలను ఆరబెట్టడం చూసి రుక్మిణికి చాలా కోపము వచ్చింది. కానీ అర్జునుడు నిద్రపోతుండడం వలన అతనికి నిద్రాభంగం చేయవద్దని కృష్ణుడు సైగ చేశాడు. ఆమెను కూడా అర్జునుని జుట్టును ఆరబెట్టమన్నాడు. ఆమె కూడా ఆ పనిలోనే నిమగ్నురాలైంది. తల ఆరిందో లేదో చూడమని సైగ చేస్తూ అతని తల వెంట్రుకలను ఆమె బుగ్గలకు ఆనించాడు. ఈ సైగ చూసి రుక్మిణికి తట్టుకోలేనంత కోపం వచ్చింది. కానీ భగవానుని ఆజ్ఞకు లోబడి తన బుగ్గల దగ్గర అర్జునుని వెంట్రుకలను వుంచుకొని పరీక్షించింది. ఆమెకు ప్రతి వెంట్రుక నుండి 'కృష్ణ, కృష్ణ' అనే శబ్దము వినిపించింది. అప్పుడు ఆమెకు శ్రీకృష్ణునిపై తనకు ఎంతో ప్రేమ వుందనే గర్వం తొలగిపోయింది. అర్జునునికి పరమాత్మ మీద వున్న అపూర్వమైన ప్రేమ అర్థమైంది. ఆమె ఎంతో సిగ్గుపడింది.

స్వా॥ప్ర॥ :- శ్రీకృష్ణుడే ఇలా చెప్పాడు కదా!–

*"యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ 1 "*

"ఎవరు నన్ను ఎలా పొందుతారో అలాగే వారిని నేను పొందుతాను." ప్రేమ అన్యోన్య ఆశ్రయంగా(పరస్పర సంబంధంగా) వుంటుందని దీని తాత్పర్యము.

## సన్యాసికి నమస్కారము చేయడం ప్రజల ధర్మము

అనంతరము రాత్రి వైద్యరాఘవజీభాయి నిత్యానంద స్వామివారిని చాలా స్తుతిస్తూ ఇలా అన్నాడు– "నేను చాలా ప్రదేశాలు తిరిగాను. అనేకమంది సాధువులను, సత్పురుషులను దర్శించాను. కానీ వారిలో చాలామందిలో డంభము(భేషజము), పాషండత్వము(వేదబాహ్యత్వం) మాత్రమే కన్పించింది. కాబట్టి ఈ రోజులలోని సన్యాసుల

విషయంలో నాకు శ్రద్ధ లేదు. బాపూజీ (శ్రీ స్వామి ప్రకాశానందులవారు) తమరిని స్తుతించారు. అది విని నేను ఇక్కడికి వచ్చాను.

స్వాIIని॥ :- సత్పురుషులందరూ సమానమే. శ్రద్ధతో సన్యాసులకు నమస్కారము చేయడం ప్రజల ధర్మము

రాఘవ :- కానీ సన్యాసము పేర వేషము మాత్రమే వుండి, ప్రజల కంట్లో దుమ్ము కొట్టేవాడు సన్యాసేనా?

## కపటము త్యజింపదగినది, క్షుద్రకర్మ

స్వాIIప్ర॥ :- మనువు బ్రాహ్మణులనుద్దేశించి ఇది చెప్పాడు –

*శ్లో॥ న ధర్మస్యాపదేశన పాపం*
*కృత్వా వ్రతం చరేత్*
*వ్రతేన పాపం ప్రచ్ఛాద్య కుర్వన్*
*స్త్రీ శూద్ర దంభనమ్ ll*

భావం: ధర్మం అనే వంక పెట్టి పాపాలను చేస్తూ వ్రతాలను ఆచరించకూడదు. వ్రతాదుల చేత పాపాలను దాచి ఆడవారిని, తెలివి లేనివారిని మోసగించకూడదు.

మహారుద్రయాగము విష్ణుయాగము అనే పేర్లతో ధర్మం వంక పెట్టి ప్రజల నుండి డబ్బు లాగి సగం మాత్రమే ఖర్చుపెట్టి మిగిలిన సగము సొంత ఖాతాలో జమ కట్టుకుంటారు. ఆ పాపము పోవడానికి తర్వాత కృచ్ఛ వ్రతము# చాంద్రాయణ వ్రతము## మొదలైన కఠినమైన వ్రతాలు చేస్తుంటారు. అలా చేయకూడదు. మూల శ్లోకంలో స్త్రీలను, శూద్రులను మోసం చేయకూడదని ఉన్నది కారణం ఆ రోజులలో స్త్రీలు, శూద్రులు మాత్రమే చదువు రానివారు. మిగిలిన మూడు వర్ణాల వారు వేద శాస్త్రాలను అభ్యసించడం వలన ధర్మాధర్మాలు తెలుసుకోగలిగేవారు. కాబట్టి వారిని మోసగించడం సాధ్యం కాదు. ఇప్పుడు కొద్దో గొప్పో చదువుకున్నా కూడా అందరూ మోసగింపబడడానికి వీలుగానే వున్నారు. ఆ రోజులలో మోసగించే పని మీది– అంటే బ్రాహ్మణులది. ఇప్పుడు మాది – అంటే సన్యాసులది.

రాఘవ :- గృహస్థులు భార్యాబిడ్డల కష్టాలు వుండటం వలన రోజులు గడుపుకోవడానికి మోసం చేస్తారు. కానీ సన్యాసులు మోసం చేయాల్సిన అవసరం ఏముున్నది?

స్వాIIప్ర॥ :- వారు గృహస్థాశ్రమము తీసుకోవలసిన అవసరమేముంది? పెళ్లి చేసుకుని పిల్లలను పుట్టించిన పాపము వస్తుందని శాస్త్రాలలో వున్నది.

రాఘవ:- గృహస్థులే లేకపోతే మీ వంటి మహాత్ములు ఎలా పుడతారు?

స్వాIIప్ర॥ :- గృహస్థులు మాత్రం మోసం చేయవచ్చని ఎక్కడైనా వున్నదా? భాగవతంలో ఇలా చెప్పబడి వున్నది:––

బ్రాహ్మణస్య చ దేహోఽయం క్షుద్రకామాయ నేష్యతే ।

భావం : 'ఈ బ్రాహ్మణ శరీరము తప్పుడు పనులు చేయడానికి కాదు' అని దాని అర్థము.

రాఘవ :- అయితే బ్రాహ్మణ ధర్మాలేమిటో చెప్పండి.

## భగవద్గీతలోని బ్రాహ్మణ ధర్మాలు

స్వాIIప్ర॥ :- నేనేమి చెప్పను భగవంతుడే భగవద్గీతలో ఇలా చెప్పాడు:

*శ్లో॥ శమో దమః తపశ్శౌచం*
*క్షాంతిరార్జవమేవ చ l*
*జ్ఞాన విజ్ఞాన మాస్తిక్యం*
*బ్రహ్మకర్మ స్వభావజం ll*

భావము : శమము, దమము, తపస్సు, పవిత్రత, క్షమ, నిష్కపటత్వము శాస్త్రజ్ఞానము, అనుభవజ్ఞానము, ఆస్తికత్వము – ఇవి బ్రాహ్మణుల స్వభావసిద్ధమైన గుణాలు.

**- సశేషం**

---

#*కృచ్ఛ వ్రతము : మూడు రోజుల ఉపవాసము, తరువాత మూడు రోజులు పాలు మాత్రమే స్వీకరించడము, తరువాతి మూడు రోజులు నెయ్యి మాత్రమే స్వీకరించేది కృచ్ఛ వ్రతము.*

##*చాంద్రాయణ వ్రతము : అమావాస్య రోజు ఉపవసించి రోజుకొక ముద్ద పెంచుకుంటూ వెళ్లి పూర్ణిమనాడు 15 ముద్దలు భుజించడం మరలా రోజుకొక ముద్ద తగ్గించుకుంటూ వచ్చి అమావాస్య రోజు పూర్తి ఉపవాసం చేయడం చాంద్రాయణ వ్రతం.*

# సన్నిధిలో సాధన!

*'సాయిబాబా'*

సద్గురుదంపతులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు, పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో వారి అల్లుడుగారైన శ్రీ అడిదం శ్రీకాంత్ గారి ఆధ్వర్యంలో, మాతృదేవి దివ్య సన్నిధానంలో 'సన్నిధిలో సాధన!' అనే దివ్యమైన కార్యక్రమం రూపుదిద్దుకుంది. మార్చి 28, 2024 సాయంత్రం నుంచి మార్చి 31, 2024 వరకూ పూజ్యశ్రీ అమ్మగారి పవిత్రమైన సన్నిధిలో సాధనలో గడిపేందుకు అనేక ప్రాంతాలనుంచి ఎంతోమంది భక్తులు తరలివచ్చారు. దివ్యమైన, భవ్యమైన ఆ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆ నాలుగు రోజులు పూజ్యశ్రీ అమ్మగారి పవిత్ర సన్నిధిని అనుభవిస్తూ, అక్కడ జరిగే సేవలలో పాలుపంచుకుంటూ, సాధన చేసుకుంటూ, సాధనలో వచ్చే అనేక సందేహాలను చర్చించి, మహాత్ముల బోధల దృష్ట్యా వాటికి సమాధానాలను వెతుక్కునేందుకు ఈ చక్కని కార్యక్రమం రూపొందించబడింది. స్మరణలో ఎక్కువసేపు గడపటం, స్మరణతో నిద్రించడం, స్మరణతో నిద్రలేవడం, ప్రార్థన, అన్య విషయాలను చర్చించకుండటం, మౌనంగా వుంటూ సన్నిధిని అనుభవించడం, మనసును గమనించుకోవడం, మహాత్ముల బోధలను గూర్చి మననం చేసుకుంటూవుండడం మొదలైనవి ఆ దివ్యసన్నిధానాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పరచుకున్న నియమాలు.

అందుకు చక్కని దినచర్య కూడా నిర్దేశించబడింది. భక్తులు ఉదయమే తమ నిత్య పారాయణతో పాటు పూజ్యశ్రీ అమ్మగారి దివ్యసన్నిధిలో జరిగేటటువంటి కొన్ని సేవలలో పాల్గొంటారు. తరువాత కొంతసేపు యోగాసనాలు వేస్తారు. యోగాసనాలు సాధనకు ఎంతో ఉపకరిస్తాయని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. భక్తుల చేత వారికి తగిన యోగాసనాలు వేయించడానికి ఒంగోలు నుంచి యోగ శిక్షకులైన శ్రీ శ్రీనివాస్ గారు వచ్చారు. భక్తులందరూ చక్కగా మూడు రోజులూ యోగాసనాలు వేశారు. అందువలన యోగాసనాలపై అందరికీ కొంత అవగాహన కూడా కలిగింది. ప్రతి పూటా తేలికపాటి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ఈ కార్యక్రమంలో మరొక నియమం.

ప్రతిరోజూ అల్పాహారం తరువాత సత్సంగం ప్రారంభమౌతుంది. ఆ సత్సంగంలో అనేక అంశాలు చర్చకు



వచ్చాయి.

మార్చి 28, సాయంత్రం 'సన్నిధిలో సాధన!' కార్యక్రమం మొదలైంది. అందరూ పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కరించుకుని భక్తనివాస్ లో సత్సంగానికై సమావేశమయ్యారు. 'పూజ్యశ్రీ మాస్టరుగారు ఆశించినట్లు శ్రద్ధగా పారాయణ ఎలా చేసుకోవాలి?' అనే అంశంతో సత్సంగం మొదలైంది. అసలు పారాయణ ఎందుకు చేసుకోవాలి? ఎలా చేసుకోవాలి? పారాయణ శ్రద్ధగా చేసుకోవాలంటే ఏం చేయాలి? పారాయణ శ్రద్ధగా జరగకపోవటానికి అవరోధాలు ఏమిటి? పారాయణ శ్రద్ధగా చేసుకోవడానికి మనసును, శరీరాన్ని ఎలా సంసిద్ధం చేసుకోవాలి? ఈ విషయంలో పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమి చెప్పారు? ఏమి ఆచరించి చూపించారు? ఈ అంశాలు మొదటి రోజున సత్సంగంలో చర్చకు వచ్చాయి. ఆ తర్వాత భక్తులందరూ భజన చేసుకుంటూ భక్త నివాస్ నుంచి పూజ్యశ్రీ అమ్మగారి దివ్య సన్నిధానానికి చేరుకుని అక్కడ సంకల్పం చెప్పుకుని పారాయణ ప్రారంభించారు. "అమ్మా! మేమందరం పూజ్యశ్రీ మాస్టరుగారు నిర్దేశించినట్లు శ్రద్ధగా పారాయణ చేసుకొని వారి అనుగ్రహం పొందేలా ఆశీర్వదించండి!" అని భక్తులందరూ సంకల్పం చెప్పుకున్నారు.

మర్నాడు ఉదయం మరలా చర్చ కొనసాగింది. అసలు పారాయణ ఎవరెవరము, ఎందుకు చేసుకుంటాము? కోరికలకు, అవసరాలకు, సమస్యలకు వున్న తేడా ఏమిటి? కృత్రిమమైన సమస్యలకు, అసలైన సమస్యలకు తేడా ఏమిటి? 'బాబా అన్ని సమస్యలకు పరిష్కార



మార్గంగా అవతరించారు' అని పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీ సాయిలీలామృతంలో వ్రాసిన వాక్యానికి అర్థం ఏమిటి? ఏ పనైనా చేయటంలో 'కుశలత' అంటే ఏమిటి? పారాయణ శ్రద్ధగా జరిగిందనడానికి గుర్తు ఏమిటి? శ్రద్ధకు, ఉత్సాహానికి, అభయానికి, సృష్టితో సామరస్యానికి వున్న సంబంధం ఏమిటి?

ఇలా ఎన్నో అంశాలను చర్చ చేసుకునే అవకాశం కలిగింది. ప్రతిపూటా కొంత సత్సంగం చేసుకొని ఆ తర్వాత ఒక సప్తాహ పారాయణను ఆ నాలుగు రోజులలోని ఏడుపూటలలో పూర్తి చేసుకోవాలని మొదట ప్రణాళిక వేసుకున్నారు. కానీ చర్చలోని అంశాలు ఎంతో చక్కటి విశ్లేషణతో, ఎన్నో సందేహాలకు సమాధానాలు వెతుక్కుంటూ సాగుతుండడంతో భక్తుల అభ్యర్థన మేరకు ఆ నాలుగు రోజులు ఉదయము, సాయంత్రము చర్చతో కూడిన సత్సంగమే కొనసాగింది. అట్టి ఉపయుక్తమైన చర్చ వలన పారాయణ పట్ల వుండవలసిన దృక్పథం సంస్కరింపబడి మరింత శ్రద్ధగా తమ పారాయణ కొనసాగగలదని భక్తులు తలచారు. పారాయణ పరిపుష్టం అవటానికి అటువంటి చర్చలు అత్యావశ్యకమని భక్తులందరూ గుర్తించారు. పారాయణ వ్యక్తిగతంగా చేసుకోగలమని, ఇలా సామూహికంగా విశ్లేషించి చర్చించుకునే అవకాశం మళ్ళీ మళ్ళీ అందరికీ రాదని భక్తులు భావించి శ్రీకాంత్ గారిని చర్చే కొనసాగించమని అభ్యర్థించారు. కనుక నాలుగు రోజులపాటు ఆ చర్చ ఎక్కువసేపు కొనసాగింది. ఆ సత్సంగంలో ఎన్నో ముఖ్యమైన అంశాలను విశ్లేషించి వివేచించుకునే అవకాశం కలిగింది.

'అల్లా మాలిక్!' అన్న బాబా వాక్యం పారాయణ శ్రద్ధగా జరగడానికి ఎలా దోహదపడుతుంది? 'పని చెయ్యి, దేవుని నామము ఉచ్చరించు, సద్గ్రంథాలు చదువు! వంతులు, కీచులాటలు మానితే భగవంతుడు సంతోషిస్తాడు!' అన్న శ్రీ సాయి సూక్తికి, శ్రద్ధగా పారాయణ చేయడానికి వున్న సంబంధం ఏమిటి? వీటిని జీవితంలో అనుష్ఠించడం ఎలా?

శ్రద్ధగా పారాయణ చేసుకోవడానికి సంకల్పం ఎలా దోహదపడుతుంది? అందుకు మన దృక్పథం ఎలా వుండాలి? మన దృక్పథానికి, మహాత్ముల దృక్పథానికి వున్న తేడా ఏమిటి? మన దృక్పథాన్ని 'అల్లా మాలిక్!' అనే



మహాత్ముల దృక్పథానికి అనుసంధానం చేసుకోవడం ఎలా? అందుకు వివేకాన్ని, వివేచనను అభివృద్ధి చేసుకోవడం ఎలా? వాటి బలంతో బలహీనతలను తొలగించుకోవడం గురించి మహాత్ములు ఏమి చెప్పారు? ఈ విషయంలో క్షుణ్ణంగాను, నిర్దుష్టంగానూ ఆలోచించి విశ్లేషించుకోవడం ఎలా?

మానవ ప్రయత్నానికి, భగవంతుని అనుగ్రహానికి వున్నటువంటి సంబంధం ఏమిటి? 'ప్రయత్నపూర్వకంగా సన్మార్గం వైపు వెళ్లకపోతే దుర్మార్గులమవుతాం!' అని మహాత్ములు ఎందుకు చెప్పారు? 'క్షణక్షణం ఆత్మవికాసానికై కృషిచేయడమే మానవ జీవిత లక్ష్యం!' అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన వాక్యానికి అర్థం ఏమిటి? కనుక మన కర్తవ్యం ఏమిటి? అందుకు అవసరమైనటువంటి శిక్షణ ఏమిటి? దీనికై మన శక్తిసామర్థ్యాలను వినియోగించడం ఎలా? వీటన్నిటికీ ధ్యానం ఎలా ఉపయోగపడుతుంది? వివేకానికి, వైరాగ్యానికి వున్న సంబంధం ఏమిటి? మహాత్ముల బోధల దృష్ట్యా మన దృక్పథాన్ని ఎలా మార్చుకోవాలి? ఎందుకు మార్చుకోవాలి?

మానవజన్మ ఎందుకు దుర్లభమైనది, విశిష్టమైనది? సంస్కారాలు ఎలా ఏర్పడతాయి? జన్మలు ఎలా వస్తాయి? ఉత్తమ జన్మలు, హీనజన్మలు అంటే ఏమిటి?

'ఉన్నదానితో అసంతృప్తి లేని దేనికోసమో తపన!' అనేటటువంటి కొరత మానవుని పుట్టుక నుంచి మరణం దాకా మానవ జీవితాన్ని ఎలా శాసిస్తుంది? మనిషి ఏ పనైనా ఎందుకు చేస్తాడు? మనిషి దేనికోసం వెతుకుతుంటాడు? మనిషిని ఎప్పుడూ అసంతృప్తి, అశాంతి ఎందుకు వెంటాడుతూ వుంటాయి?

జీవితంలో మనం పెట్టుకునేటటువంటి లక్ష్యాలకు, పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినటువంటి జీవిత లక్ష్యానికి వున్న తేడా ఏమిటి? ఈ విశ్లేషణ శ్రద్ధగా పారాయణ చేయడానికి ఎలా దోహదపడుతుంది?

ఇలా ఎన్నెన్నో విషయాలన్నింటి గురించి ఆ నాలుగు రోజులు అహర్నిశలు చర్చ కొనసాగుతూనే వున్నది! ఆ ఉత్సాహంలో భక్తులకు ఆకలిదప్పులు, సమయాసమయాలు తెలియనేలేదు! భక్తులంతా అత్యంత ఉత్సాహంగా చర్చలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాము తెలుసుకున్నటువంటి విషయాలు తమ ఆధ్యాత్మిక సాధనకు ఎంతో ఉపయోగపడతాయని, ఇటువంటి విశ్లేషణా కార్యక్రమాలను తరచుగా జరిపించమని అందరూ శ్రీకాంత్ గారిని అభ్యర్థించారు.

మార్చి 31వ తేదీన సాయంత్రం ఈ కార్యక్రమాన్ని ముగించుకుని, పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో రాత్రివరకూ చక్కగా గడిపి, ప్రసాదం తీసుకుని, భక్తులందరూ తమ తమ స్వస్థానాలకు చేరుకున్నారు. అలా పూజ్యశ్రీ అమ్మగారి దివ్యసన్నిధానంలో 'సన్నిధిలో సాధన!' కార్యక్రమం దిగ్విజయంగా పరిసమాప్తమైంది.

అత్యంత దుర్లభమైన, మహోన్నతమైన, అమూల్యమైన పూజ్య గురుదంపతుల పవిత్ర మార్గదర్శకత్వం వారి అనుగ్రహం వల్ల మనకందరికీ లభించింది. ఆ మార్గంలో వారిని అనుసరించి నడిచేందుకు ఇటువంటి ఎన్నో కార్యక్రమాలలో భక్తులమందరమూ కలుద్దాం! ఆ దివ్య తల్లిదండ్రులకు తగిన బిడ్డలమయ్యేందుకు మన శక్తివంచన లేకుండా ప్రయత్నిద్దాం! వారు ఆశించిన విధంగా తయారవుదాం! వారు చూపించిన సన్మార్గంలో కలిసి నడుద్దాం! పరస్పర సౌభ్రాతృత్వాన్ని, ప్రకృతితో సామరస్యాన్ని పెంపొందించుకుందాం. వసుధైక కుటుంబంగా జీవిద్దాం. ఇటువంటి అన్వేషణ, తత్వచింతనా పూరితమైన సాధనా ప్రయత్నంలో వారి పవిత్ర సాన్నిధ్యంలో మన జీవితం ధన్యమై సార్థకమగుగాక!!

జై సాయి మాస్టర్!

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

దక్షిణ భారతదేశంలోని కృష్ణానదీ తీరాన మహాశక్తి స్వరూపిణి అయిన జగన్మాత కనకదుర్గమ్మ వెలసిన పుణ్యక్షేత్రం, విజయవాడ నగరం. ఈ నగర సమీపాన గల ఆకిరిపల్లి అనే గ్రామంలో వేదవేదాంగ పారంగతులకు, యోగవిదులకు, సదాచార సంపన్నులకు నిలయమైన వంశంలో శ్రీ గట్టుపల్లి శ్రీనివాసాచార్యులుగారికి రెండవ కుమారునిగా జన్మించారు, శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారి తండ్రిగారైన శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యులవారు.

పశ్చిమ గోదావరి జిల్లాలోని ద్వారకా తిరుమల నివాసి అయిన వీరి పినతల్లి శ్రీమతి ఎక్కిరాల రంగమ్మగారు తనకు సంతానం లేనందువలన శ్రీ అనంతాచార్యులవారిని దత్తత స్వీకారం చేసుకొన్నందువలన వీరు ఎక్కిరాల అనంతాచార్యగా వాసికెక్కారు.

శ్రీ అనంతాచార్యులవారు బహుముఖ ప్రజ్ఞాశాలి. మహామేధావి. సంస్కృతాంధ్రాంగ్ల భాషా కోవిదులు. సూర్యోపాసనతో సూర్యసాక్షాత్కారాన్ని పొందిన దైవశక్తి సమన్వితులు. శ్రీ అనంతాచార్య గొప్ప మల్ల విశారదులు. మల్లవిద్యలో మద్రాసు ఒలింపిక్స్ లో వీరు స్టేట్ ఛాంపియన్ షిప్ సాధించారు. ఈ పోటీలలో వీరు వరుసగా నాలుగుసార్లు విజయం సాధించి, వెండిగదను బహుమతిగా పొందారు. వీరు గుంటూరు, బాపట్ల పట్టణాలలో తాలింఖానాలను నెలకొల్పి, ఉత్సాహవంతులైన యువకుల కెందరికో వ్యాయామము, కుస్తీపట్లు నేర్పేవారు. మల్లవిద్యలలో ఉచితముగా శిక్షణను యిచ్చి ఎందరినో గొప్ప మల్లవిద్యా ప్రావీణ్యులనుగా చేశారు.

మేధావి, కారణజన్ముడు అయిన శ్రీ అనంతాచార్య ఆ రోజుల్లోని పరపాలన పీడితమయిన మన దేశ దురవస్థకు ఎంతో వ్యధచెంది, దేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొన్నారు.

వీరు పాఠశాల, కళాశాల విద్యలు పూర్తి అయిన తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఎం.ఏ., ఆంగ్లంలో పట్టభద్రులయ్యారు. ఉన్నత విద్యావంతులు, మేధావి అయిన వీరు ఎన్నో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలనుండి ఉన్నత పదవులను అలంకరించవలసినదిగా వచ్చిన ఆహ్వానాలను స్వీకరించక వైద్యవృత్తి ద్వారా సమాజ సేవ చేయ నిశ్చయించారు.

అయితే శ్రీఅనంతాచార్య అసమాన వేద విద్యాపారంగతులు, యోగవిదుల కుటుంబంలో జన్మించటం వలన కేవలం ఆంగ్లవిద్య నభ్యసించటంతో తృప్తిపడలేదు. వేదవేదాంగాలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో కొందరు వేదపండితుల వద్దకు వెళ్ళారు. అప్పటికి ఆయన వయస్సు 26 సంవత్సరాలు.

“వేదం అభ్యసించటం అనేది సామాన్యమైన విషయం కాదు. చిన్న వయసులోనే అభ్యాసం ప్రారంభించాలి. 26 సం॥ల వయస్సులో వేదం అభ్యసించడం సాధ్యపడదు. కనుక నీకు మేము వేదవిద్య బోధించలేము” అన్నారు వేదపండితులు. అలా ఎందరో పండితుల వద్దకు వెళ్ళి చివరకు ప్రకాశం జిల్లా సింగరాయకొండ సమీపానగల కల్కివాయి గ్రామస్థులైన శ్రీ విక్రాల రామచంద్రాచార్యులుగారి వద్దకు వెళ్ళారు శ్రీ అనంతాచార్య. రామచంద్రాచార్యులవారు మహాపండితులు, విద్యావాచస్పతి, విద్యారణ్య పంచానన బిరుదాంకితులు, నవద్వీప పండిత పర్యవేక్షకులు.

శ్రీ అనంతాచార్య శ్రీరామచంద్రాచార్యులవారితో ఒక చిత్రమైన ఒప్పందం కుదుర్చుకున్నారు. అదేమిటంటే సూర్యోదయంతో ప్రారంభించి మధ్యాహ్న భోజన సమయం వరకు రామచంద్రాచార్యులవారు తాము నేర్పవలసిన వేదపాఠాలు వరుసగా శిష్యునకు చదివి విన్పించాలి. భోజనానంతరం మధ్యాహ్న సమయం నుండి శ్రీ అనంతాచార్య

అప్పటివరకు రామచంద్రాచార్యులవారు చదివి విన్పించిన వేదపాఠాలను యథాతథంగా తిరిగి గురువుగారి ఎదుట ఒప్పచెప్పుతారు.

ఈ షరతు విని ఎంతో ఆశ్చర్యపోయారు శ్రీ రామచంద్రాచార్యులవారు. ఎందుకంటే, సాధారణంగా సంస్కృతంలో వుండే వేదపాఠాలు విద్యార్థులచేత రెండు మూడు లైన్లు చదివించి తిరిగి వాటిని ఎన్నోసార్లు వల్లె వేయిస్తారు. అలా కొన్ని రోజుల పాటు వల్లె వేయగా వేయగా అవి విద్యార్థుల మనస్సులలో గుర్తుండిపోతాయి. కానీ గంటల తరబడి వందలాది శ్లోకాలు వరుసగా చదవమని, వల్లె వేయకుండానే ఒక్కసారి వినినంత మాత్రాన ఆ పాఠాలనన్నింటిని తిరిగి ఒప్పజెప్పుతాననీ అంటున్న శ్రీ అనంతాచార్య మాటలకు విస్తుపోయారాయన. కానీ అనంతాచార్యులవారి మాటలలోని ఆత్మవిశ్వాసం, నిర్భయత్వం చూసిన ఆ గురువుగారు ఈ వింత ఏమిటో చూద్దామని పాఠం ప్రారంభించారు. మొదటి రోజు పాఠం పూర్తి అయింది. భోజనానంతరం గురుశిష్యులిద్దరూ సమావేశమయినారు.

వారు సుమారు 6-7 గంటలపాటు వరుసగా చదివిన పాఠాలన్నింటినీ ఎక్కడా ఒక చిన్న తప్పుగానీ, స్వరదోషంగానీ లేకుండా వున్నది వున్నట్లుగా ఒప్పజెప్పారు శ్రీ అనంతాచార్య. రామచంద్రాచార్యులవారి ఆశ్చర్యానికి అంతులేదు. వారు శిష్యుని ధారణాశక్తికి ఎంతో సంతోషించారు. అలా నాలుగైదు రోజులు గడచి పోయాయి. ఆ తర్వాత ఒక రోజున సాయంత్రం వేళ ఆ రోజు గురువుగారు చెప్పిన పాఠాలన్నీ తిరిగి ఒప్పజెప్పిన శ్రీ అనంతాచార్య, గురువుగారు మరుసటి రోజు చెప్పబోయే పాఠాలను కూడా వరుసక్రమంలో చదవసాగారు. శ్రీ అనంతాచార్యులవారి అసామాన్య ప్రజ్ఞాపాటవానికి నిర్ఘాంతపోయారు, శ్రీ రామచంద్రాచార్యులవారు. ఈ విధంగా 40 రోజులలో వేదం, 6 నెలలో యోగాభ్యాసం, ఋగ్వేద సంహిత, ఖగోళం, ఆయుర్వేదం, వ్యాకరణం, శ్రౌతం, సూర్యసిద్ధాంతం, ఉపనిషత్తులు - యిలా వేదవేదాంగాలన్నింటినీ సంపూర్ణంగా అభ్యసించారు శ్రీ అనంతాచార్య. ఆ తర్వాత ప్రతిభాశాలి అయిన తన శిష్యుడు శ్రీ అనంతాచార్యులవారిని శ్రీ రామచంద్రాచార్యుల వారు :-

"ఇతరులు వ్రాసిన వేదవేదాంగాల వ్యాఖ్యానాలను, అర్థాలను నీవు చదువవద్దు. నీ అంతర్దృష్టితో చూసి నీకు స్ఫురించిన వివరణలే సరియైన వ్యాఖ్యానాలు. ఆ అర్థాలే సరైన ప్రామాణికాలు. నీ సందేహాల నివృత్తి కోసం ఏ గ్రంథాలను గానీ ఏ పండితులను గానీ నీవు ఆశ్రయించవలసిన పనిలేదు" అని ఆదేశించారు.

ఈ విధంగా వేదవేదాంగాలను అభ్యసించకుండానే ధారాళముగా ప్రవచించిన మహానుభావులు, సకల వేదోపనిషత్తులను అంతర్దృష్టితో అవలోకించి అవగాహన చేసుకొనగలిగిన అసమాన ప్రజ్ఞాశాలి శ్రీ అనంతాచార్య దైవాంశ సంభూతులు అనటంలో సందేహం లేదు.

**- సశేషం**

## జ్ఞాని మాటకర్థం జ్ఞానులే తెల్పాలి!

03వ పేజీ తరువాయి

చేయవలసినది వేరేమీ తోచేదికాదు. ఆయన సన్నిధిలో అడుగుపెట్టిన దగ్గరనుండీ ఆయన సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు, సర్వగతుడూ అన్న అనుభవం కలుగుతూనే వుండేది. ఆయన రక్షణ అనుక్షణమూ అనుభవం అయ్యేది."

క్రమంగా ఈ అనుభవం ఆయన సన్నిధిలోనే కాక, సర్వదా ఎలా కలిగేదో కూడా ఆ భక్తురాలి అనుభవాలు నిరూపిస్తాయి.

తమ యొక్క ఈ తత్వాన్ని సూచిస్తూనే కాబోలు - బాలాభావూ అనే ఒక భక్తుడు ఒక అర్ధరాత్రి మసీదులో సాయిని దర్శించి తనకు ఉపదేశమిచ్చి శిష్యునిగా చేసుకోవలసినదిగా కోరినప్పుడు, "గురువుండి తీరవలసిన అవసరం లేదు. సర్వమూ మనలోనే వున్నది. మనమేమి చేస్తామో, దానికి తగ్గ ఫలితం వస్తుంది. నీవేది ఇతరులకు యిస్తావో, అదే నీకు లభిస్తుంది. వేరే గురువు అవసరం లేదు. అంతా నీలోనే వున్నది. హృదయం తెలిపేది వినడం, అది చెప్పినట్లు నడవడమూ నేర్చుకో. మనను మనం చూసుకోవాలి. అదే మన గురువు" అన్నారు సాయి

స్థూలదృష్టికి గురువు అవసరం లేదని చెప్పినట్లు తోచినా, ఈ భక్తుడి అనుభవం చూస్తే అలా హృదయంలో గురువును గుర్తించడం కూడా అతనికి సాయియే క్రమంగా నేర్పవలసి వచ్చినదని తెలియగలదు.

(గత సంచిక తరువాయి)

# బుద్ధ ధ్యాన హృదయము

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - ౨

ఈ రెంటిలో సాధనకుపకరించేది కేవలశ్రద్ధ (Bare attention). స్వచ్ఛము, ఏకాగ్రము అయిన ఎఱుకతో మనకూ, మనలోనూ అనుక్షణమూ జరుగుతూండే దానిని గుర్తిస్తుండడమే కేవలశ్రద్ధ. పంచేంద్రియాల ద్వారాగాని, మనస్సు ద్వారాగాని వస్తుగ్రహణము జరుగుతూండేటప్పుడు గుర్తింపబడే అంశాలపై మాత్రమే లగ్నమైన దానిని 'కేవలగుర్తింపు' అంటాము. అప్పుడా గుర్తింపుకు కాయక, మానసిక, వాచకములైన ప్రతిక్రియలేమీ లేక (ఇష్టము. అయిష్టము వంటివి చేయక వస్తువు యొక్క మంచి చెడ్డలను గాని, ప్రియ, అప్రియములను గాని, మరియే యితర విషయముల గురించిన తలంపులు లేకుండ) ఒక్క గుర్తింపు మాత్రమే పనిచేయాలి. అటువంటి మానసిక ప్రతిక్రియలు జరిగినట్లైతే వాటిని కొట్టివేయడం గాని, కొనసాగించడం గాని చేయక కేవలశ్రద్ధకు గురిచేయడం. తరువాత వాటిని విడచి వేయడమే చేయవలసినది. కేవలశ్రద్ధా సాధనలో కృషి నిర్దుష్టంగా వుండాలి. లేకుంటే ఆ పేరే నిరర్థకమౌతుంది. ఈ సాధన వస్తువును ప్రథమంగా గుర్తించే ఆరంభ దశను గమనిస్తూ వుంటుంది. కాని నిత్యానుభవంలో ఈ క్రియ చాలా స్వల్పకాలంలో జరిగిపోతుంది. దీని ద్వారా అసంపూర్ణము, లోపభూయిష్టము అయిన పైపై విషయగ్రహణము మాత్రమే జరుగుతుంది. వస్తువును తిరిగి తిరిగి గమనించడం మొదటి గ్రహణాన్ని నిర్దుష్టము, సమగ్రము చేసుకోవలసి వుంటుంది. కాని సామాన్య మానవుడిలా చేయడు. మొదటి గుర్తింపునే సరియైనదిగా భావించి దానినాధారంగా కొన్ని భావాలు, అభిప్రాయాలు యేర్పరుచుకుంటాడు. కేవలశ్రద్ధా సాధన యీ మొదటి యింద్రియ గ్రహణాన్ని మరింత పటిష్టం చేస్తుంది. విషయగ్రాహక స్థితిలో మనస్సును మరింతసేపు నిలిపి గుర్తింపు సరిగా జరిగేలాగున చూస్తుంది. వస్తువుపై అనవసరపు భావాలు రాకుండా ముందే జాగ్రత్త పడుతుంది. కనుక జీవుల మనస్సులను పరిశుద్ధి చేయడానికి యిది గొప్ప సాధనం.

వస్తువు యొక్క తత్వాన్ని యే మనోభావాలూ కమ్మకుండా యథాతథంగా గుర్తించడమే కేవలశ్రద్ధ. ఇది అనుకున్నంత తేలిక కాదు. మనం మామూలుగా చేసే పనికాదు. నిర్లిప్తతతో కూడిన పరిశోధనలోనే యిది సాధ్యము. సామాన్యంగా మానవుడు వస్తువుల యొక్క తత్వంపై శ్రద్ధ చూపడు. తన యిష్టాయిష్టాలు, ప్రయోజనాల దృష్ట్యానే వాటిని చూస్తాడు. మానవుడు తన మానసిక భౌతిక జగత్తులోని వస్తువులకు, వాటిపట్ల తనకున్న యిష్టాయిష్టాలు విలువల తోటి వాటిని గుర్తిస్తాడు. అట్టి మనోభావాలలోనే తను జీవిస్తాడు. ఈ భావాలే అతని ప్రతిక్రియలను నిర్ణయిస్తాయి. ఇటువంటి మనోభావాలు లేని కేవలశ్రద్ధా సాధన సామాన్య మానవునికి వినూత్నమైన లోకంలోకి బాటలాగా తోస్తుంది.

ఇంద్రియాలతో వస్తువులను గ్రహించడమనేది ఒకే క్రియ అని, అది యింద్రియ గ్రహణకు గోచరమయ్యే వస్తువు లేక విషయం ఒక్కటేనని మామూలుగా మనిషి తలుస్తాడు - కాని కేవలశ్రద్ధ సాధన ఆరంభంలోనే గుర్తింపులో నిజానికి జరిగేది వివిధ యింద్రియాలు, మానసిక ప్రక్రియలు, ఒక దాని వెంట ఒకటి అతి త్వరితంగా వరుసలో జరుగుతాయి అని. అంతేగాక యే భావాలతోను చెందని కేవల వస్తు గ్రహణమెంత కష్టమో,



యెంత అరుదో తెలుసుకుంటాడు సాధకుడు. ఉదాహరణకు సామాన్య నేత్రానుభవం కేవల వస్తువును మాత్రమే గుర్తించక, ఆ వస్తువు అందమైనదో, వికారమో, ప్రియమో, అప్రియమో, ఉపయోగమో. నిరుపయోగమో, ప్రమాదకరమో మొదలైన భావాలతో గూడి ఆ రంగుటద్దాలలోంచే గోచరిస్తుంది. ఈ దృశ్యానుభవం ఒక ప్రాణిని గూర్చినదేయైతే, యిది నావలెనే ఒక ప్రాణి, ఒక వ్యక్తిత్వం కలది అన్న భావాలతో కూడి వుంటుంది.

ఇటువంటి దోషభూయిష్టమైన యింద్రియానుభూతి స్మృతి లేక జ్ఞాపకశక్తిలో ఆ భావాలతో సహా యిమిడిపోతుంది. తరువాత దానిని గుర్తు చేసే వేరొక అనుభూతి కలిగినప్పుడు యీ భావాలతో గూడిన స్మృతే మేల్కొంటుంది. వర్తమానంలో జరిగిన గుర్తింపును ఆ స్మృతులు ప్రభావితం చేసి సరియైన అవగాహన కలుగకుండా చేస్తాయి. ఆ దోషభూయిష్టమైన అవగాహనను ఆధారంగా చేసుకొనే మన నిర్ణయాలు, మనోభావాలు యేర్పడతాయి గనుక మనకు జీవితమే దోషభూయిష్టమౌతుంది.

ఇటువంటి రంగుటద్దాలు మన గుర్తింపుకు అడ్డు రాకుండా చేయడమే కేవలశ్రద్ధ యొక్క ఉపయోగము. యదార్థ వస్తు తత్త్వావగాహన కలగాలంటే కేవలశ్రద్ధ సాధనను పట్టుదలతో కొనసాగించాలి. అభ్యాసం కొనసాగిన కొద్దీ శ్రద్ధ మరింత సూక్ష్మమై నానాటికి సూక్ష్మతరములైన పూర్వస్మృతుల కాలుష్యాన్ని జల్లించి వేస్తుంది. చివరికి యదార్థమైన వస్తుతత్త్వం మాత్రమే మనకు గుర్తింపౌతుంది.

ఒక ఉదాహరణ - ఒక వ్యక్తి తన ముంజేతిమీద నున్న గాయాన్ని చూస్తున్నాడనుకుందాం. ఈ విషయంలో యదార్థమైన దృష్టి విషయం ఆ శరీరభాగము, దాని శిథిల పరిస్థితి మాత్రమే. దానిలోని మాంసము, రక్తము, చీము మొదలైనవి శరీర భాగాలకు సంబంధించిన 'శరీర స్మృతి సాధనయొక్క విషయాలు.' ఆ గాయం వల్ల కలిగిన బాధ వేదనానుపశ్యనం యొక్క విషయం. నేనొక వ్యక్తిని, గాయపడి బాధ ననుభవిస్తున్న వాడ్ని. నేను అనే భావం మానసిక స్థితి గూర్చిన స్మృతి సాధనయొక్క విషయము (భ్రాంతియుత మనస్సు). లేక దీనినే మానసిక అంశాల గూర్చిన స్మృతి సాధన విషయంగా తలచవచ్చు. అనగా శారీరక స్పర్శచేత కలిగిన మానసిక బంధము అని దీనిని తలచవచ్చు. తనను గాయపరచిన వ్యక్తిపైన కలిగిన కినుక మానసిక స్థితి గూర్చిన స్మృతి సాధనా విషయము (ద్వేషంతో కూడిన మనస్సు); లేక దీనిని గూడ మానసిక అంశముల గూర్చిన స్మృతి సాధనా విషయంగా (కోపము అను అవరోధము) తలచవచ్చు. కేవలశ్రద్ధ పూర్వ స్మృతుల కాలుష్యం నుండి యదార్థ వస్తువును గూర్చిన గుర్తింపును యెలా వేరుపరచగలదో గమనించవచ్చు.

వస్తువు యొక్క యదార్థ తత్త్వాన్ని గుర్తించగలగడం యెంత ఆవశ్యకమో బుద్ధుడే నొక్కి చెప్పారు. ఒక గురువు తన శిష్యుని సాధనా సూత్రాన్నిలా చెప్పారు.

కనబడేదాంట్లో వాస్తవంగా కనబడేది మాత్రమే గుర్తింపు కావాలి. వినబడేదాంట్లో వినబడేది మాత్రమే గుర్తింపు కావాలి. ఇంద్రియానుభవంలో (వాసన, రుచి, స్పర్శ) యింద్రియానుభవమే వుండాలి. యోచించబడే దాంట్లో యోచించబడేదే వుండాలి.

(కేవల విషయగ్రహణ యొక్క ప్రాశస్త్యాన్ని బుద్ధుడిలా చెప్పారు "చూడబడేదాంట్లో కేవలం చూడబడేది మాత్రమే వుండాలి. అలానే వినబడేదాంట్లో వినబడేది, ఇంద్రియ గోచరమయ్యే దాంట్లో యింద్రియ గోచరమయ్యేదే వుండాలి. ఆలోచింపబడేదాంట్లో ఆలోచింపబడేదే వుండాలి.")

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

***శ్రీమతి శ్రీదేవి***

జన్మదినోత్సవ వేడుకలు వరుసగా కొన్ని రోజులు జరిగాయి. ఒకరోజు శ్రీ ఆనందమయి మాత భక్తులతో, "చాలా రోజుల నుండి మగవారు మాత్రమే రాత్రి సమయాలలో నామ సంకీర్తన చేస్తున్నారు. ఈ రోజు రాత్రి స్త్రీలము అందరము జాగరణ చేసి రాత్రంతా నామ సంకీర్తనలో గడపాలి" అన్నారు. మహిళలందరూ యెంతో సంతోషంగా అందుకు సమ్మతించారు. ఆనాటి రాత్రి 30 మంది మహిళలు తెల్లవార్లూ నామ సంకీర్తనలో పాల్గొన్నారు. అమ్మ కూడా వారితో కలిసి రాత్రి అంతా నామ సంకీర్తన చేశారు. తెల్లవారిన తర్వాత అమ్మ పురుషులందరినీ కూర్చుని రోజంతా పగటి సమయంలో నామ సంకీర్తన కొనసాగించవలసిందిగా చెప్పి, స్త్రీలను వెంటబెట్టుకుని కోనేటి స్నానానికి బయలుదేరారు. సిద్దేశ్వరీ కాళీ మందిరానికి వెళ్లి అక్కడ వున్న కోనేటిలో అమ్మ స్త్రీలతో కలిసి యెంతోసేపు స్నానం చేశారు. అది ఒక అపూర్వమైన ఆనందకర సన్నివేశం. అమ్మతో కలిసి కోనేటిలో జలక్రీడలలో పాల్గొన్న స్త్రీలు దివ్యానుభూతిని, ఆనందపారవశ్యాన్ని పొందారు. వారి జీవితాలలో యీ సంఘటనలు మధురానుభూతులుగా మిగిలిపోయాయి.

స్నానానంతరం కోనేటి నుండి బయటకు వచ్చిన తర్వాత అమ్మ సిద్ధేశ్వరికి వచ్చి తమకు బాలభోగ్(సంతర్పణ) సమర్పించమని చెప్పారు. శశాంక బాబు, మరికొందరు భక్తులు కలిసి వెంటనే సిద్ధేశ్వరి లోనే వంటలు మొదలుపెట్టారు. అసంఖ్యాక భక్తులు సిద్ధేశ్వరికి వచ్చి సంకీర్తన ఆరంభించారు. ఆ తర్వాత భక్తులందరూ ప్రసాదాలు స్వీకరించి సాయంత్రానికి యిళ్లకు వెళ్లిపోయారు. కొందరు మహిళలు ఆనాటి రాత్రి కూడా జాగరణ, నామసంకీర్తన చేస్తామని అమ్మకు విన్నవించుకున్నారు. అమ్మ అంగీకారంతో రాత్రంతా నామసంకీర్తనతో ఆ ప్రదేశం మారు మ్రోగింది. ఆ రోజు 150 మంది స్త్రీలు సంకీర్తనలో పాల్గొన్నారు. తెల్లవారుతూనే క్రిందటి రోజు వలెనే కోనేటి స్నానాలు, సంతర్పణలు యథావిధిగా జరిగిపోయాయి.

ఈ విధంగా రకరకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలతో యెంతో వైభవంగా శ్రీ ఆనందమయి మాత జన్మదినోత్సవాలు జరిగాయి.

జన్మదినోత్సవాలు ముగిసిన అనంతరం అమ్మ భోలానాథ్ గారితో కలిసి ఢాకా విడిచి వేరువేరు ప్రదేశాలలో పర్యటించేందుకు సిద్ధమైనారు. జన్మదిన వేడుకలకు కొద్దికాలం ముందు అమ్మ గురుప్రియాదేవిని, ఆమె తండ్రిగారైన శశాంక మోహన్ గారిని తమ ఇల్లు ఖాళీ చేసి సిద్ధేశ్వరిలో నివసించవలసినదిగా ఆదేశించారు. వారు అదేవిధంగా సిద్ధేశ్వరిలో వుండనారంభించారు. ఆనాటి నుండి వారిద్దరు సిద్ధేశ్వరిని విడచి ఒక్కరోజు కూడా తమ ఇంటికి వెళ్లలేదు. స్వగృహంలో అడుగు పెట్టనేలేదు. తమ జీవితాంతం అమ్మ సన్నిధిలోనే వుండిపోయారు.

అనుకున్న ప్రకారం జన్మదినోత్సవాలు ముగిసిన వెంటనే అమ్మ, భోలానాథ్ గారు కొందరు భక్తులతో కలిసి పర్యటనార్థం బయలుదేరారు. మొదట భాజిత్-పూరు వెళ్లి అక్కడ నుండి డార్జిలింగ్,

శ్రీపురం, మైమనసింహ, నవద్వీప్, పూరీ దర్శించారు. ఆ తర్వాత కాశీ, అయోధ్య, కలకత్తా నగరాలలో కొన్నాళ్లు వుండి చాలా రోజులు తర్వాత ఢాకా తిరిగి వచ్చారు. ఢాకాలో నేరుగా ఆశ్రమానికి వచ్చి అక్కడ కొన్నాళ్లు వున్నారు శ్రీ ఆనందమయి మాత.

ఢాకాలో వున్నప్పుడు అమ్మ దర్శనార్థం అమ్మ ఆడపడుచు శ్రీ కాళీప్రసన్న బాబు భార్య అమ్మ దర్శనార్థం ఢాకా వచ్చారు. ఆమెను అందరూ 'అత్తయ్యగారు' అని పిలుస్తారు గొప్ప జ్ఞానవంతురాలు, ధర్మాత్మురాలు, మహా భక్తురాలు అయిన అత్తయ్యగారంటే అమ్మకి ప్రత్యేకమైన అభిమానం. అమ్మ పై యెనలేని భక్తి కలిగి వున్న అత్తయ్యగారు అమ్మ నోటి నుండి వచ్చిన ప్రతిమాటను వేదవాక్కులా భావించేవారు. అమ్మ ఆదేశాలను త్రికరణశుద్ధిగా తు.చ. తప్పక పాటించేవారు. నిరంతరం భగవన్నామస్మరణలో కాలం గడిపే ఒక గొప్ప సాధకురాలిగా అమ్మ పర్యవేక్షణలో మంచి పరిణితి సాధించిన ధన్యురాలు ఆమె.

ఒకరోజు అమ్మ ఢాకా ఆశ్రమంలో వుండగా అత్తయ్యగారితో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో అత్తయ్యగారి చేతిలో ఒక చిన్న వెదురు కర్ర వున్నది. ఆ కర్ర ఆమెకు ఆ పరిసరాలలో దొరికిందట. దానిని అటుయిటూ చేతితో వూపుతూ అత్తయ్యగారు గురుప్రియా దేవితో "ఇదిగో యిది నీ దండం. అవునా?" అని నవ్వుతూ సరదాగా అన్నారు. వెంటనే అమ్మ అత్తయ్యగారితో "నువ్వు యిప్పుడు ఈ దండాన్ని తీసుకుని కులదా దాదా సేవిస్తున్న యజ్ఞాగ్నికి తాకించి తీసుకురా" అన్నారు. అత్తయ్యగారు అమ్మ చెప్పిన విధంగానే ఆ కర్రను యజ్ఞాగ్నికి తాకించి తీసుకువచ్చారు. అప్పుడు అమ్మ తన కట్టుకున్న చీరె నుండి కొన్ని దారాలను తెంపి ఆ వెదురు కర్ర మధ్యలో వాటిని చుట్టి, కర్రను గురుప్రియకిస్తూ, "ఇక నుండి నువ్వు యీ దండం చేతిలో లేకుండా యెవరితోనూ మాట్లాడవద్దు" అన్నారు.

**- సశేషం**

## పూజ్య భరద్వాజ గురుదేవుల ఆరాధనా మహోత్సవం

12వ పేజీ తరువాయి

వాళ్లలో మేధావులైన వారికి వచ్చిన సమాధానం పేరు ఆధ్యాత్మికత! దీనిని పొందినవారు సత్వగుణ ప్రధానులై వుంటారు. అలాంటివారు ఎవరా అని ఆలోచిస్తే, ఒక వివేకానందుడు, ఒక రమణ మహర్షి, ఒక మాస్టరుగారు మనకు లభిస్తారు. వాళ్ల జీవితాల్ని పరిశీలించినట్లయితే వారు సత్వగుణ ప్రధానులుగా ఎలా వున్నారో మనకు అర్థమవుతుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు, భగవంతుడు అంటే ఏమిటి? సత్వగుణం అంటే ఏమిటి? తత్వచింతన ఎలా జరగాలి? సృష్టి పట్ల, నీ పట్ల భావన ఎలా వుండాలి? అనే ఎన్నో ముఖ్యమైన విషయాలను తమ గ్రంథాల ద్వారా బోధించారు. ఆ గ్రంథాల్లోచెప్పినట్లుఆచరించుకుంటూ పోతుంటే, సత్వగుణం అనండి, అద్భుత జీవిత విధానం అనండి, శక్తి సామర్థ్యాలనండి.....ఇవన్నీ వచ్చే అవకాశం తప్పకుండా వుంటుంది.

ఎవరో పూజ్యశ్రీ మాస్టరుగారిని 'సత్యయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలియుగం ఇవన్నీ అంటే ఏమిటండి?' అని అడిగారట. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఆ యుగాలన్నీ బయట లేవు, నీలోనే వున్నాయి" అని చెప్తూ, నువ్వు ఇప్పుడు ఎలా బతికితే అలా ఆ యుగం నీకు అనుభవం అవుతుంది అని చెప్పారట. అంటే సత్వగుణ ప్రధానుడవై వుంటే సత్యయుగం అనుభవంలోకి వస్తుంది, ఇలా చెప్పుకుంటూ,,, అన్ని యుగాలు గురించి అతనికి అర్థం అయ్యేటట్లు బోధించారట. ఇలా బతకడం అనేది వారి గ్రంథాలను అధ్యయనం చేసి ఆచరణలో పెట్టిన వాళ్లకు మాత్రమే సాధ్యపడుతుంది. కనుక వారి గ్రంథాలు చదువుతూ ఆచరించితే నిజంగానే పెను మార్పులు అనుభవం అవుతాయి.

శ్రీగురుడు ఒకేసారి కొంతమంది ఇళ్లల్లో వున్న అనుభవం యిచ్చినట్లు, అసామాన్య సమర్థ సద్గురువైన పూజ్యశ్రీ మాస్టరుగారు, గ్రంథాల రూపంలో లక్షలమంది ఇళ్లల్లో పూజలు అందుకుంటున్నారు. వారి ఆరాధన మహోత్సవ సందర్భంగా, వారి గ్రంథాలు అర్థమయ్యేటట్లు చదువుకుని మనందరం అద్భుతమైన ప్రగతి సాధించాలని కోరుకుంటున్నాను" అంటూ వారి సత్సంగాన్ని ముగించారు.

అంతటితో పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల ఆరాధన మహోత్సవాల వేడుకలకు ముగింపు పలికారు. ●

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి శ్యామలమ్మ, గూడూరు

నాకు భక్తి మార్గము అంటే చాలా ఇష్టము. 'జ్యోతిష్యము వచ్చు' అన్న ప్రతి వాళ్ళకి నా చేయి చూపించి 'ఆధ్యాత్మికంగా నా జీవితం ఎలా ఉంటుంది' అని అడిగేదాన్ని. ఒకసారి బాబా స్వప్న దర్శనమిచ్చి "ఎవరికీ చేయి చూపించవద్దు" అని చెప్పారు. అప్పటినుంచి అది మానుకున్నాను. ఇంకొకసారి స్వప్నంలో "పోతీ పఢో" అని చెప్పారు. అంటే 'చరిత్ర చదువు' అని అర్థమట.

ఒకసారి నాకొక స్వప్నం వచ్చింది. అందులో, నేను నా గురుదేవులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారితో "ఒకచోట బాబా గుడి వుందట, అక్కడ పూజారితో బాబా మాట్లాడతారట, ఆయనకి ప్రత్యక్షంగా కనిపిస్తారట" అని చెప్తున్నాను. ఆ స్వప్నంలోనే మాస్టరుగారు నాతో, "అయితే ఆయనని నువ్వు తప్పక చూడాలి" అని చెప్పారు.

కొన్ని రోజుల తరువాత మైసూరులో వుండే మా అక్కయ్య "మా ఇంటిదగ్గర 'ప్రసన్న సాయి మందిరం' వుంది. అందులో రాజుగారని పూజారి వుంటారు. వారితో బాబా ప్రత్యక్షంగా మాట్లాడతారట. నువ్వు ఒకసారి వస్తే ఆ గుడికి వెడదాము" అని ఉత్తరం రాసింది. నాకు స్వప్నంలో వచ్చినట్లే అక్క చెప్పిందని నేను చాలా ఆశ్చర్యపోయాను. నేను దసరాలకి బయలుదేరి, మా అక్కయ్య వాళ్ళింటికి మైసూరు వెళ్ళాను. ఒకరోజు మేమిద్దరం ప్రసన్న సాయి మందిరానికి వెళ్ళాము.

అక్కడ బాబా విగ్రహం నల్లరంగులో వుంది. ద్వారాకామాయి బాబా లాగా కూర్చుని వున్నారు. అక్కడి పూజారి 'రాజు' గారిని చూసాను. చాలామంది భక్తులు వున్నారు. ఏరోజు ఎవరు పూజ చేసుకోవాలో, వింజామర ఎవరు వీచాలో, అభిషేకం ఎవరు చెయ్యాలో బాబా చెప్తే, రాజుగారు వారిని పిలుస్తారు. అలా బాబా చెప్పని వాళ్లెవరైనా ముందుకివస్తే, బాబా విపరీతంగా తిడతారట. అప్పుడు రాజుగారు వాళ్ళని కోప్పడతారు.

ఒకరోజు నేను బాబా పాదాలకి నమస్కారం చేసుకుని లేస్తుంటే, బాబా ముక్కులోనించి పొగ వచ్చింది. ఆ విషయం రాజుగారికి చెప్తే, "బాబా హుక్కా పీలుస్తున్నప్పుడు వచ్చే పొగ అది. మీకు వారు ఆ అనుభవాన్ని ప్రసాదించారు" అన్నారు. అక్కడ నాకు బాబా చాలా సేవలు యిచ్చారు. ఆ గుళ్లో శుక్రవారం నాడు, బాబా వారిని లక్ష్మీదేవిలా భావించి సేవలు చేస్తారు.

ఒక శుక్రవారం నాడు బాబాగారికి వింజామర వీచే సేవ ఇచ్చారు. ఒక గురువారం బాబాకి అభిషేకం చేసే అవకాశం వచ్చింది. పూజారి రాజుగారు ఒక రూపాయి బిళ్ళ తీసుకుని, దానిని బాబా కాలి బొటన వేలు మీద వుంచి నీళ్లుపోసాక, అప్పుడు మిగతా శరీరానికి స్నానం చేయించాలి.

ఒకరోజు పూజారి రాజుగారు, "ఆంధ్రా నించి వచ్చిన ఇద్దరిలో ఒకరిని బాబా పూజ చేసుకొమ్మంటున్నా" రని చెప్పారు. అక్కడ నేను, మా అక్క ఇద్దరమే ఆంధ్రావాళ్ళం. మా

మిగతా 29వ పేజీలో

# ఆచార్యుని అద్భుత లీలలు


*శ్రీరామ్ కుమార్, ఆళ్లగడ్డ*

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ లీలావైభవాన్ని ఆళ్లగడ్డ వాస్తవ్యులు శ్రీరామ్ కుమార్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నేను పదవతరగతి చదివే రోజుల్లో నాకు బాగా నవలలు చదివే అలవాటుండేది. ఒకసారి ఏ నవలా దొరకనప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన శ్రీసాయిలీలామృతం ఇంట్లో కనిపించింది. అది కూడా నవల లాగానే వేరే పుస్తకంలో దాచుకుని చదివాను. నేను ఇలా చేస్తూ వుంటే చూసి మా నాన్న, "వీడు అడుక్కుతింటాడు" అనేవాడు. ఆ మాట వల్ల నాకు చాలా బాధగా వుండటమే కాదు, అడుక్కునేవారి మీద చాలా కోపంగా వుండేది. కాలాంతరంలో ఈ విషయంలో బాబా నన్ను ఎలా సంస్కరించారో కూడా చెబుతాను.

నేను వర్క్ ఇన్స్పెక్టర్(works-inspector) గా ఉద్యోగం చేసేవాడిని. కానీ అక్కడివాళ్ళు నాచేత అవినీతికి సంబంధించిన పనులు చేయించేవారు. నాకు మనస్కరించక వాళ్లకు చెప్పకుండా వచ్చేశాను. నాకు చిన్నప్పటినుంచి ఆయాసం ఎక్కువగా వుండేది. మా అన్న వాళ్ళు నెల్లూరులో ఆసుపత్రిలో చూపిస్తామంటే వెళ్ళానుగాని ఆ రోజు డాక్టరుగారు రాలేదు. ఉద్యోగం లేకపోవడం, ఆరోగ్యం బాగలేకపోవడం.. ఇవన్నీ గమనించిన నా స్నేహితుని భార్య, "నువ్వు సుబ్రహ్మణ్యవ్రతం చేసుకుంటే నీ బాధలన్నీ తీరుతాయి. ఉప్పు, కారం, పులుపు, నూనె మానేసి 41 రోజులు వ్రతం చెయ్యి!" అన్నది. నేను వేరే సంకల్పంతో ఈ వ్రతం మొదలుపెట్టాను. నాకు, 'మనకు అన్నీ ఇచ్చేది ఆ భగవంతుడే కదా! ఆయనే మన ఆధీనంలో వుంటే ఎంత బాగుంటుంది?' అనిపించింది. అందుకని 'భగవంతుడు నా అధీనంలో వుండాలి' అన్న సంకల్పంతో సుబ్రహ్మణ్యవ్రతం చేసుకున్నాను. నా వ్రతం ఫలించింది. నాకు భగవంతుడే సద్గురురూపంలో దర్శనమిచ్చారు. ఆయన సాంగత్యం వల్ల భగవంతుడే నా అధీనంలో వుండాలన్న సంకల్పం ఎంతటి అవివేకమైనదో అర్థమైంది.

నేను ఖాళీగా వున్నానని తెలిసిన



ఒకాయన, "ఈరోజు కలిచేడులో బాబా గుడి ప్రారంభోత్సవం. అక్కడకి వెళ్లి ఈ గోపురకలశం ఇచ్చిరా!" అని పంపించాడు. నేను కలిచేడు వెళ్లాను. అక్కడ ఒక స్తంభం పక్కన దాన్ని ఆనుకోకుండా ఒకాయన కూర్చుని వున్నారు. నేను అక్కడకు వెళ్ళగానే నన్ను చూసి, "రా! రా!" అని పిలుస్తున్నారు. కలశం తీసుకురావడం ఆలస్యమైందేమో, అందుకే తొందరగా రమ్మని పిలుస్తున్నారనుకున్నాను. ఈలోపల నా చేతులో కలశం ఎవరో తీసుకున్నారు. నన్ను పిలిచినాయనకు అందరూ నమస్కారాలు పెడుతున్నారు.

ఒకాయన, "ఆయన చాలా గొప్ప వ్యక్తి. IAS చదువుకున్నారు. నమస్కారం చేసుకో!" అన్నాడు. "IAS అయితే నాకేంటి? నువ్వు చేసుకో!" అన్నాను. నమస్కారం చేసుకోవడానికి అందరూ వరుసకట్టారు. ఇంకొకాయన నన్ను అందులోకి నెట్టాడు. నేను మొండిగా బయటికి వస్తే బాగుండదని నేనూ నమస్కారం చేసుకున్నాను. అయితే ఆ నమస్కారానికి విలువే లేదు. ఊరికే పాదాలమీద చెయ్యి పెట్టీపెట్టకుండా అలా తగిల్చి లేచాను. అందరికీ ఇచ్చినట్టే నాకు కూడా ఊదీ ఇచ్చారు. నేనక్కడినుంచి వెళ్ళిపోయాను.

కొంతసేపటికి పక్కనే వున్న ఒక ఇంట్లోవాళ్ళు అందరికీ త్రాగడానికి పాలు ఇస్తున్నారు వెళ్లమన్నారు. నేను అక్కడకు వెళ్లేసరికి, ఎదురుగా ఇందాక నేను నమస్కారం చేసుకున్నాయన ఒక కుర్చీలో కళ్ళు మూసుకుని కూర్చుని వున్నారు. క్రింద చాపల మీద కళ్ళుమూసుకుని కొంతమంది కూర్చుని వున్నారు. 'సరిపోయింది, ఇక్కడందరూ పిచ్చోళ్లే వున్నట్లున్నారు!' అనుకున్నాను. కొంతసేపటికి అందరూ లేచి ఆయనకు పాదనమస్కారం చేసుకుని బయలుదేరుతున్నారు. ఆయన మాత్రం కళ్ళు మూసుకునే వున్నారు. 'ఎవరు నమస్కారం చేస్తున్నారో కూడా పట్టించుకోకుండా ఈయన కళ్ళు మూసుకునే వున్నారు, ఇప్పుడు నేను నమస్కారం చేస్తే మాత్రం గమనిస్తారా?!' అనుకుంటూ నేను కూడా నమస్కారం చేసుకున్నాను. వెంటనే ఆయన నా తలమీద చేయిపెట్టి ఆశీర్వదించారు. అంతే! నా లోపల అంతా మారిపోయింది! అప్పటివరకూ నాకు వున్న భావాలన్నీ పోయి, 'ఈయన మామూలు మనిషి కాదు, సాక్షాత్తు భగవంతుడు!' అన్న భావన వచ్చేసింది. అప్పుడు తెలుసుకున్నాను.. ఆయన పేరు భరద్వాజగారని, సాయి మార్గంలో అందరినీ నడిపిస్తున్నారని, ఎంతో గొప్పవారనీ!

ఆయన గురించి ఇంకా తెలుసుకోవాలని కలిచేడులో వున్న భక్తులందరినీ అడిగాను. ఆయన పుట్టినరోజుకి వచ్చిన సావనీర్ చదివాను. ఇలా ఆయన గురించి తెలుసుకున్న కొద్దీ ఆనందంతో మనసు పొంగిపోయేది. ఆయన ఫోటో జేబులో పెట్టుకుని తిరుగుతూ వుండేవాడిని. నేను చేసిన వ్రతం ఈవిధంగా ఫలించిందనుకున్నాను. తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారిని కలుసుకోవాలని గాని, భక్తబృందంతో కలిసి వుండాలని గానీ అనిపించలేదు.

వర్క్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం వదిలేశాక ఎవరితోటీ సంబంధం వుండదని కండక్టర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాను. 1991లో నాకు ఆ ఉద్యోగం వచ్చింది. నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందినట్లు అప్పటివరకూ తెలియలేదు. తెలిసిన తరవాత చాలా బాధపడ్డాను. పూజ్యశ్రీ మాస్టరుగారు అప్పుడప్పుడు స్వప్నంలో దర్శనమిచ్చేవారు.

నేను డ్యూటీకి వెళ్ళేటప్పుడు ఒక సంచీలో పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన గ్రంథాలు తీసుకెళ్ళేవాడిని. ఏమాత్రం విరామం దొరికినా నేనొక్కడినే ఎవ్వరికీ కనిపించకుండా ఒంటరిగా కూర్చుని ఆ గ్రంథాలు చదువుకునేవాడిని.

ఒకసారి గుంతకల్లులో మా బస్సు చెడిపోయింది. బాగవడానికి రెండు, మూడు గంటలు పడుతుందన్నారు. నేను వెంటనే నా ఏకాగ్రతకు భంగం కలగదన్న ఉద్దేశ్యంతో ఆ పక్కనే బాగా గుబురుగావున్న ముళ్లకంపల మధ్యలోనుంచి దూరి లోపలకు వెళ్లి అక్కల్కోటస్వామి చరిత్ర చదువుకుంటున్నాను. కొంతసేపటికి నా స్నేహితుడొకడు నన్ను వెతుక్కుంటూ వచ్చి, "ఎప్పుడు మామా పెళ్లి? " అన్నాడు. అతన్ని చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. ఎందుకంటే ఆ లోపలకు ఎవరూ వచ్చే అవకాశమే లేదు. పైగా రాగానే నా పెళ్లిగురించి అడిగాడు. నేనేమో, "మా గురుదేవుల ఆజ్ఞ అయినపుడు!" అన్నాను. ఆ రోజు గ్రంథం పూర్తి చేశాను. ఆ రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చారు.

ఆ స్వప్నంలో ఒక పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ లాగా వుంది. అక్కడ మెట్లున్నాయి. నేను ఆ మెట్ల మీద కూర్చున్నాను. క్రింద పూజ్యశ్రీ మాస్టరుగారు పడుకునివున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారి కాళ్ళు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక్క వుదుటన పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వచ్చి కాళ్ళు పడుతున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు సశరీరంగా వున్నప్పుడు రెండుసార్లు పాదనమస్కారం చేసుకునే అవకాశం దొరికినా తగినంత శ్రద్ధ చూపించక వృధా చేసుకున్నానన్న బాధ నాకెప్పుడూ వుండేది. దాంతో ఒక్కసారిగా పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాలు చూసేసరికి, ఆ అవకాశం వదలకూడదని వచ్చి పాదాలు పడుతూ, "మాస్టరుగారూ!

మీరు కిందపడుకున్నారేమిటి?" అని అడుగుతున్నాను. "ఇక్కడ బాగానే వుంది లేరా!" అన్నారు. నేను చుట్టూ చూశాను. చుట్టుపక్కల అన్ని ఇళ్ళకూ తాళాలు వేసి వున్నాయి. ఒకచోట పూరిపాక వుంటే అక్కడకు వెళ్లి దాన్ని శుభ్రం చేసి, ఒక మంచం వేసి, ఆయన పడుకోడానికి వీలుగా ఏర్పాటు చేశాను. అక్కడ ఏవో శబ్దాలు వినిపిస్తున్నాయి. 'అవేం శబ్దాల'ని పూజ్యశ్రీ మాస్టరుగారు అడిగారు. "అదేదో పెళ్లి వాయిద్యాలలాగా వున్నాయండీ!" అని చెప్పాను. "ఓ, పెళ్లి ఊరేగింపా! అక్కడ నువ్వే కదా ముఖ్యమైనవాడివి? వెళ్ళు!" అన్నారు. నేనక్కడకెళితే అక్కడ నా స్నేహితులందరూ కనిపిస్తున్నారు. ఇదీ స్వప్నం. నేను ఆ స్వప్నంలో నాకు పాదసేవ దొరికిందని సంతోషిస్తున్నాను తప్ప మిగిలినదేదీ పట్టించుకోలేదు.

అప్పుడే నాకు ఒక పెళ్లి సంబంధం వచ్చింది. ఇదివరకు కూడా వాళ్ళు సంబంధం వచ్చింది. నేనే సుముఖత చూపలేదు. ఈ స్వప్నం వచ్చాక పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను పెళ్లి చేసుకోమని అదేశిస్తున్నారని అనిపించి ఇదే విషయం మా నాన్నకి చెప్పాను. ఆయన, "నీ ఇష్టం రా! నీ గురువు ఎలా చెప్తే అలానే చెయ్యి," అన్నారు. పెళ్ళిచూపులకు వెళ్తే వాళ్ళ ఇంట్లో పెద్ద సాయిబాబా ఫోటో వుంది. అది చూశాక అమ్మాయి గురించి గాని, వాళ్ళ స్థితిగతుల గురించి కానీ ఏవీ పట్టించుకోకుండా అదే సంబంధాన్ని కుదుర్చుకుని వచ్చేశాను. 1997 లో వివాహం జరిగింది.

సశరీరంగా వున్నప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారిని సేవించుకోలేదని నాకు చాలా బాధగా వుండేది. ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిర దర్శనానికి వెళ్ళినప్పుడల్లా పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి కూడా వెళ్ళేవాడిని. గురుపుత్రిక వేదమ్మగారి కళ్యాణానికి గురుదక్షిణ సమర్పించుకోవాలన్న కోరికతో సన్నిహితులద్వారా ఆ విషయాన్ని విన్నవించుకుంటే దయతో పూజ్యశ్రీ అమ్మగారు అనుమతిచ్చారు. మా అమ్మగారి ద్వారా ఆ కానుక సమర్పించుకున్నాను. మా అదృష్టవశాత్తు ఆ కళ్యాణానికి వెళ్లి సేవ చేసుకోగలిగాము. అప్పుడు చాలా తృప్తిగా అనిపించింది. తరవాత పూజ్యశ్రీ మాస్టరుగారు కలలో కనిపించి నన్ను దక్షిణ అడిగారు. కలలోనే స్వయంగా ఆయనే దక్షిణ అడిగారన్న ఆనందంతో నేను ఉబ్బి తబ్బిబ్బవ్వుతున్నాను. ఎంతసేపు జేబులో చేయి పెట్టినా పావలా కాసులే వస్తున్నాయి. అంతటి మహాత్ములు దక్షిణ అడిగితే ఇంత తక్కువ ఎలా ఇవ్వడం అని బాధపడుతూ వెతుకుతుంటే ఒక జేబులో 516 రూపాయలు దొరికాయి. అవి సమర్పించుకున్నాను. ఇక అప్పటినుంచి ఎప్పుడు ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్లినా 516 రూపాయలు సమర్పించుకోవాలన్న నియమం పెట్టుకున్నాను.

ఒకసారి శ్రీగురుచరిత్ర ఏకాహం చేయాలనుకున్నాను. ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరం దగ్గరకు ఉదయమే వెళ్లి పారాయణ మొదలుపెట్టాను. ఒక్క పేజీ చదివే సరికి బాగా నిద్ర తూగుతోంది. ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా అదే పరిస్థితి. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పుకుని బాగా బాధపడ్డాను. వెంటనే, "నడుస్తూ చదవవచ్చు కదరా!" అన్నట్లు అనిపించి, వెంటనే లేచి పూజ్యశ్రీ మాస్టరుగారికి ప్రదక్షిణ చేస్తున్నట్లు భావిస్తూ మందిరం చుట్టూ తిరుగుతూ పారాయణ చేశాను. భావం బాగా నిలిచింది. పూజ్యశ్రీ మాస్టరుగారికి ప్రదక్షిణ చేసినట్లయింది. పారాయణ రాత్రి 9 గంటలకు పూర్తయింది. ఆ రాత్రికి అక్కడే పడుకున్నాను.

తెల్లవారుఝామున 5 గంటలకు బాబా కాకడ హారతికి చిన్న చిన్న పిల్లలు కూడా వచ్చి పాడుతున్నారు. నేను చాలా ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ ఎప్పుడూ కాకడ హారతికి హాజరవ్వనందుకు కొద్దిగా బాధ కూడా కలిగింది. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారిని నేను కూడా ఆళ్లగడ్డలో కాకడ హారతికి వెళ్ళేటట్లు అనుమతి, ఆశీర్వాదము ఇవ్వమని కోరుకున్నాను. ఆళ్లగడ్డ వెళ్లిన దగ్గరనుంచి కాకడ హారతికి వెళుతున్నాను. అక్కడ హారతి 5 గంటలకు మొదలవుతుంది. ఆళ్లగడ్డలో మేముంటున్న ఇంటికి బాబా గుడి నాలుగు కిలోమీటర్ల దూరం వుంటుంది. నేను రోజూ ఉదయం తెల్లవారుఝామున మూడున్నర గంటలకు లేచి నాలుగు గంటలకు బయలుదేరితేనే కాని గుడికి చేరలేను. సైకిల్ మీద వెళ్ళాలి. పైగా నేను కండక్టర్ని కదా! రోజూ

400 వందల కిలోమీటర్ల బస్సు ప్రయాణం వుంటుంది. రోజూ ఇంటికి వచ్చేసరికి రాత్రి అవుతుంది. అప్పుడు స్నానం చేసి శ్రీగురుచరిత్ర, శ్రీసాయిలీలామృతం, ఒక మహాత్ముని చరిత్ర పారాయణ చేసుకుని పడుకుంటాను. అయితే మనసు ఎప్పుడైనా మొండికేస్తుందేమోనన్న భయంతో ఏరోజైనా ఐదు గంటల ఒక్క నిముషానికి గుళ్ళోకి ప్రవేశిస్తే వంద రూపాయలు హుండీలో వేస్తానని బాబాకు మాట ఇచ్చాను. కరోనా సమయం వరకూ అది నిరాటంకంగా జరిగింది. ఇన్ని సంవత్సరాలలో రెండుసార్లు మాత్రమే వంద రూపాయలు కట్టాను.

ఇంకొకసారి శ్రీసాయిలీలామృతం ఏకాహ పారాయణ పెట్టుకున్నాను. అది పూర్తి చేసి ఆళ్లగడ్డ తిరిగి వచ్చాక ఒకరోజు ఒక ముస్లిం మహిళ బాబా గుడికి వచ్చి, "ఏమమ్మా, ఇక్కడ సత్సంగాలు జరుగుతాయా?" అని మా చైర్ పర్సన్ ని అడిగారట. ఆవిడ, "జరగవు!" అన్నారట. "అయితే ఇక్కడ బాబా ఎందుకుంటాడు? వుండనే వుండడు!" అనుకుంటూ వెళ్లిపోయిందిట! అప్పుడు అందరం కలసి సత్సంగాలు చేద్దామని ఆలోచించి నన్ను సత్సంగాలు చేయమన్నారు. మొట్టమొదట ఒక శనివారం ఆ ముస్లిం మహిళ ఇంటికి వెళ్లి సత్సంగం చేసి వచ్చాను. నాకు మంగళవారం సెలవు కనుక తర్వాత నుంచి ప్రతి మంగళవారం సత్సంగాలు చేయడం మొదలుపెట్టాను. సత్సంగాలు మొదలుపెట్టి 12 సంవత్సరాలు పూర్తయింది. ఆ సందర్భంగా సత్సంగాల్లో పాల్గొన్నవారందరికీ ఫోన్ ద్వారా కృతజ్ఞతలు తెలుపుకున్నాను. అదే రోజు రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు స్వప్న దర్శనమిచ్చి ఒక మంత్రం చెప్పారు. ఆ విధంగా వారి ఆశీస్సులు లభించాయి.

కొన్ని సంవత్సరాల క్రితం కమిటీ పెద్దలు ప్రతి గురువారం ఐదు ఇళ్లల్లో భిక్ష చేయాలని నిర్ణయించుకున్నారు. అలా తెచ్చిన భిక్ష గుడిలో చేసిన ప్రసాదంలో కలిపి అందరికీ అన్నదానం చేయడం జరుగుతుంది. ప్రతి గురువారం నేనే ఐదు ఇళ్లలో భిక్షకు వెళతాను. ఇది కూడా మొదలుపెట్టి చాలా సంవత్సరాలైంది. మా నాన్న నన్ను 'అడుక్కుని తింటావురా!' అన్న మాట ఈనాడు దీవెనలా పనిచేసింది. దానిద్వారా భిక్షగాళ్ల మీద నాకుండే కోపం పటాపంచలైంది.

ఒకవైపు ఉద్యోగం, ఒకవైపు గుడిలో సేవలు, పర్వదినాలలో ప్రత్యేక సేవలూ.. ఇవన్నీ ఏ ఆటంకమూ లేకుండా జరుగుతున్నాయంటే అది పూర్తిగా నా గురుదేవులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి కరుణాకటాక్షమే! ఒక్క ఆశీర్వచనంతో నాకు ఇంతటి గొప్ప జీవితాన్ని అనుగ్రహించిన వారి ఋణం ఏమిచ్చి తీర్చుకోగలను? వారాశించిన మార్గంలో నడిచే శక్తిని ప్రసాదించమని వేడుకోవడం తప్ప?!

ఓం సన్మార్గదర్శకాయ శ్రీ భరద్వాజ సద్గురవే నమః!

జై సాయి మాస్టర్ !!

# ద్వారకామాయి అనుభవ మంటపము

25వ పేజీ తరువాయి

అక్క, "నేను యిక్కడే వుంటానుకదా, తరవాత చేసుకుంటాను. నువ్వు పూజ చేసుకో" అంది. సరేనన్నాను. అప్పుడు బాబా నన్ను 'తలకి వస్త్రం' ఇచ్చి పూజ చేసుకొమ్మన్నారట. ఆ విషయం రాజుగారు చెప్పారు. అది విని నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే, ఒకసారి మా గూడూరుకి తుఫాను వచ్చినపుడు మా అమ్మ, "మా అమ్మాయి కుటుంబం క్షేమంగా వుంటే, బాబా! మీకు తలకు చుట్టుకునే వస్త్రం సమర్పిస్తా" నని మా తరఫున మొక్కింది. ఆ విషయం బాబా చెప్పారు. నాకు ఒళ్ళు గగుర్పొడిచింది! వెంటనే బైటకి వెళ్లి వస్త్రం తీసుకొచ్చి బాబా చెప్పినట్లే పూజ పూర్తి చేసుకున్నాను.

నేనక్కడ దాదాపు నెలరోజులున్నాను. చాలా సేవలు చేసుకోవడానికి బాబా అవకాశం యిచ్చారు. అక్కడ చాలామంది 'బాబా ఎప్పుడు పిలుస్తారా' అని ఎదురు చూసేవారు. ఇలాంటి అద్భుతం నాకు తెలిసి ఏ బాబా గుడిలోనూ జరగలేదు. దీనికి సంబంధించిన కొన్ని లీలలు పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీసాయిలీలామృతములో, 23వ అధ్యాయం, 'సమాధానమిచ్చే సమాధి' లో పొందుపరిచారు.

ఈవిధంగా బాబా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ఈనాటికీ కాపాడుతూ వున్నారు.

సమర్థ సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!! ●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధనోత్సవము తిథుల ప్రకారం మే 31, 2024 న మరియు ఆంగ్ల కాలమాన ప్రకారం జూన్ 3, 2024 న గుమ్మళంపాడు 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానము' లో జరుగును. ఉత్సవాలకు సంబంధించి మరిన్ని వివరములకు శ్రీ మధు గారిని (9542985469), శ్రీ పి.రమేష్ గారిని (9440018038) సంప్రదించగలరు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ్ మహారాజ్ ఆరాధనోత్సవము ఏప్రిల్ 12, 2024న 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానము' గుమ్మళంపాడులో వైభవంగా జరిగింది. గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు విశేష పూజ, సత్సంగం చేసారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు భక్తిప్రపత్తులతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.